ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 16 మార్చి 2024

ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం



అంగరంగ వైభవంగా కోదండరాముని బ్రహ్మోత్సవాలు

- ఏప్రిల్ 22న సీతారాముల కల్యాణం
- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట, మార్చి 15: ఏకశిలా నగరి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16వ తేది నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఒంటిమిట్టలో శుక్రవారం ఆయన అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కోదండ రామాలయం ప్రాంగణంలో భక్తులకు అన్నదానం, తాగునీరు, క్యూలైన్ల ఏర్పాటు వంటి వాటిపై అధికారులతో చర్చించారు. ఏప్రిల్ 16న సాయంత్రం అంకురార్పణతో కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, 22న స్వామివారి కల్యాణం, 23న రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. బ్రహ్మోత్సవాలకు, స్వామివారి కల్యాణానికి హాజరయ్యే భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, వాటిలోకి భక్తులకు అనుమతించాల్సిన విధానంపై మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కల్యాణ వేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకునేలా నిర్వహిస్తామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికి ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, కడప ఆర్డీవో మధుసూదన్‌రావు, డిప్యూటీ ఈవోలు నటేష్ బాబు, ప్రశాంతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్, విజిలెన్స్ డీఎస్పీ బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో మహిళ పరార్..!



కురవంకలో నిందితురాలి దుకాణం ముందు గుమికూడిన బాధితులు

- ఇంటి ముందు బాధితుల ఆందోళన
- పోలీసుల అదుపులో నిందితురాలి భర్త

మదనపల్లె, మార్చి 15: మదనపల్లెలో కోట్ల రూపాయల చీటీల స్కామ్ చల్లారక ముందే.. అదే తరహాలో మరో మహిళ ఆర్థిక నేరం వెలుగులోకి వచ్చింది. మదనపల్లె మండలం వేంపల్లెకు చెందిన దేవేంద్ర, ఆయన భార్య కవితలు.. స్థానిక కురవంకలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో భర్త దేవేంద్ర టిఫెన్ సెంటర్, ఆయన భార్య కవిత చిల్లర దుకాణం నిర్వహిస్తు న్నారు. చాలా ఏళ్లుగా నమ్మకంగా ఉంటూ అప్పులు చేశారు. స్థానికుల నుంచి తీసుకున్న రుణం సకాలంలో చెల్లించకపోవడం, పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వచ్చి మహిళను నిలదీశారు. అంతే ఎవరికీ చెప్పా పెట్టకుండా నిందితురాలు పరారైంది. దీంతో బాధితులంతా ఆమె దుకాణం, ఇంటి ముందు శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని, పరారైన నిందితురాలని రప్పించాలంటూ బాధితులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న తాలూకా ఎస్ఐ రవికుమార్ అక్కడికి చేరు కుని బాధితులతో మాట్లాడారు. అక్కడే ఉన్న నిందితురాలి భర్తను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితులు ఎంతమంది ఉన్నారు ? ఎంత మేర అప్పులు ఇచ్చారో వివరాలతో కూడిన జాబితాతో పాటు సరైన పద్ధతిలో ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధితు లకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పట్టణం లోని వివిధ ప్రాంతాలకు చెందిన 30 మందికి పైగా రూ.1.20 కోట్లు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నారు.

బాదుడే.. బాదుడు..!

జగనన్న బాదుడుకు కాదేదీ అనర్హం అనేలా ఉంది రాష్ట్ర పరిస్థితి. ఏ మీటింగులో చూసినా అక్కచెల్లెమ్మల అభివృద్ధే తన ధ్యేయంగా, పేదల కళ్లల్లో ఆనందం చూడడమే తన లక్ష్యంగా డప్పు కొట్టుకునే సీఎం ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదు. ప్రతి దానిలోనూ ప్రజలను బాదడమే పనిగా పెట్టుకుని ప్రజల రక్తం పీలుస్తున్నారు. ఒకవైపు నిత్యావసర ధరలు, మద్యం, ఇసుక ధరలు పెంచి సామాన్యుల చమటను దోపిడీ చేస్తున్నా.. మరో వైపు పెట్రోలు, డీజలు ధరలను పక్క రాష్ట్రాల కంటే అదనంగా వసూలు చేస్తూ ప్రజలను నట్టేట ముంచేస్తున్నారు. దీంతో ఆంధ్ర- కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో పదుల సంఖ్యలో పెట్రోలు బంకులు మూత పడడంతో యజమానులు లబోదిబోమంటున్నారు.



ఉప్పుకుంటపల్లె వద్ద ఒకప్పుడు కళకళలాడి ఇప్పుడు బండి ఎద్దులకు ఆశ్రయంగా మారిన పెట్రోలుబంకు

- లీటరు పెట్రోల్‌పై రూ.10 అదనంగా వసూలు
- కర్ణాటక నుంచి పెద్దఎత్తున పెట్రోలు, డీజిల్ దిగుమతి
- ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో పెట్రోలు బంకుల మూత

బి.కొత్తకోట, మార్చి 15: కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో బి.కొత్తకోట మండలం ఉంది. అయితే కర్ణాటక రాష్ట్రం కంటే మనరాష్ట్రంలో పెట్రోలు, డీజలు ధరలపై రూ.10 వ్యత్యాసం ఉండడంతో అక్కడి నుంచి వాహనాల్లో ఇక్కడికి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో సరిహద్దు గ్రామాల్లో ఉండే పెట్రోలు బంకులు మూతపడ్డాయి. లక్షలు వెచ్చించి ప్రారంభించినా వ్యాపారం జరగక పోవడంతో యజమానులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా పెట్రోలు, వంటగ్యాస్‌లపై జీఎస్‌టీ వర్తించదు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో కాకుండా వ్యాట్‌ను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుచుకునే వెసులుబాటు వుంది. ఈ అవకాశాన్ని జగన్ ప్రభుత్వం ఆసరాగా తీసుకుని పెట్రోల్, డీజిల్ ధరలపై వ్యాట్ ట్యాక్స్ విధించింది. పొరుగు రాష్ట్రంతో పోలిస్తే ఒక్కో లీటరుకు సగటున రూ.10 అధికంగా వసూలు చేస్తోంది. ఆయన బాదుడే బాదుడులో ఇది కూడా ఒకటని చెప్పవచ్చు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో ప్రస్తుతం పెట్రోల్ ధర రూ.102 వుండగా, మన రాష్ట్రంలో పెట్రోల్ ధర రూ.112గా వుంది. అదే విధంగా డీజిల్ కూడా రూ.10లు తేడాతో వుంది. కేంద్ర ప్రభుత్వం వీటి అమ్మకాలపై వ్యాట్‌ను అమలు చేసే అధికారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడంతో ఈ పరిస్థితి దాపురించినట్లు తెలుస్తోంది. కర్ణాటక ప్రభుత్వం తక్కువ ట్యాక్స్ విధించడంతో మన కంటే రూ.10 తక్కువకు అక్కడి కంపెనీలు విక్రయిస్తున్నాయి.

కర్ణాటక నుంచి పెద్దఎత్తున దిగుమతి

పొరుగురాష్ట్రం కర్ణాటకలో తక్కువ ధరకు డీజిల్, పెట్రోల్ లభిస్తుండడంతో సరిహద్దు ప్రాంతాల నుంచి మన రాష్ట్రంలోకి పెద్దఎత్తున దిగుమతి అవుతోంది. ఆటోలు, టెంపోలు, ద్విచక్ర వాహనాల్లో చిరు వ్యాపారులు, దళారులు దిగుమతి చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా చిల్లరగా అమ్ముకునే వీరు ఆంధ్ర బంకులలో కొనుగోలు చేయకుండా సరిహద్దున ఉన్న పెట్రోలు బంకుల నుంచి కొనుగోలు చేసి బహిరంగంగా తెచ్చుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయారనే విమర్శలున్నాయి. దీంతో రాష్ట్ర ఖజానాకు భారీగా చిల్లుపడుతోందని పలువురు అంటున్నారు.

సరిహద్దులో బంకుల మూత

రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో అప్పట్లో కోరుకుని మరీ పెట్రోలు బంకులు స్థాపించిన యజమానులు నేడు లబోదిబోమంటున్నారు. కి.మీ దూరంలో లీటరు మీద రూ.10 తక్కువకు దొరుకుతుంటే ఇక్కడ కొనుగోలు చేయకుండా అందరూ పొరుగు కర్ణాటక బంకులవైపు వెళ్లిపోతుండడంతో, వ్యాపారం లేక, చేసేది లేక తమ బంకులను ఒక్కొక్కటిగా మూసివేస్తున్నారు. లేదంటే నష్టాలు చూపించి మరో ప్రాంతానికి తరలించేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. బి.కొత్తకోట పరిసరాలలోని ఉప్పుకుంటపల్లె, చెన్నరాయునిపల్లె, చిలకలనేర్పు తదితర ప్రాంతాల్లోని బంకులు మూతపడ్డాయి. ఒకప్పుడు కళకళలాడిన ఈ బంకులు నేడు కళావిహీనంగా మారి శిథిలావస్థకు చేరాయి.

ధరలకు మోక్షం ఎప్పుడో...

కర్ణాటక రాష్ట్రం లాగా మన రాష్ట్రంలో ధరలకు మోక్షం ఎప్పుడెప్పుడా అని వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సరిహద్దు ప్రాంతాలైన చాకవేలు, చేలూరు, ఇరగంపల్లి, గౌనిపల్లి, రాయల్పాడులలో వున్న బంకులను వినియోగించుకుంటూ మనప్రాంత వ్యాపారులు, వాహనదారులు కాలం వెళ్లదీస్తున్నారు. బి.కొత్తకోట నుంచి బెంగళూరుకు కారు బయలుదేరితో బి.కొత్తకోటలో రూ.100-200కు మాత్రం పట్టించుకొని సరిహద్దులో బంకు రాగానే ఫుల్‌ట్యాంకు చేయిస్తున్నారు. అమ్ముకునేవారు సైతం 200 లీటర్లు ఒక్కసారి తరలించుకుని వస్తే రూ.2 వేలు మిగులుతుండడంతో ఎప్పుడూ కర్నాటక డీజిల్, పెట్రోల్ పైనే ఆధార పడుతున్నారు.

ధరల వ్యత్యాసం ఉన్న మాట వాస్తవమే..

కర్నాటకతో పోలిస్తే మన రాష్ట్రంలో డీజిల్, పెట్రోలు ధరలు సుమారు పది రూపాయల వరకు వ్యత్యాసం ఉన్న మాట వాస్తవమే. వీటి ధరలు ఆయా రాష్ట్రాలు, వేసే ట్యాక్స్‌ను బట్టి ఉంటాయి. వినియోగదారులు ఎక్కడ కొనుగోలు చేయాలన్నది వారి ఇష్టం. దాన్ని కట్టడి చేయలేం. క్వాలిటీలో తేడా ఉన్నా, కొలతల్లో మోసం ఉన్నా తగిన చర్యలు తీసుకోవచ్చు.

- పుణ్యవతి, తహసీల్దారు, బి.కొత్తకోట

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సెహరీ (ఆదివారం ఉదయం)
రాయచోటి	6.30	5.01
మదనపల్లె	6.31	5.08
రాజంపేట	6.30	5.04
పీలేరు	6.29	5.06



ఆంధ్రా..కర్నాటకలోని బంకులలో రూ.10 వ్యత్యాసంతో ఉన్న ధరల బోర్డులు



కర్నాటక నుంచి ఆంధ్రకు దిగుమతి అవుతున్న పెట్రోలు

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా ఆచరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 15: భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి అధికారి తప్పనిసరిగా ఆచరించాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులు ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ టీముల్లోని అధికారులు, సిబ్బంది తదితరులతో వివిధ అంశాల్లో పాటించాల్సిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రవర్తన నియమావళి అమలు చేయడం మనందరి బాధ్యత అని, ఇందులో భాగంగా కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా నియోజకవర్గ స్థాయిలో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కంట్రోల్ రూము నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి రిపోర్టును రిటర్నింగ్ అధికారి ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపించాల్సి ఉంటుందన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి 100 నిమిషాల వ్యవధిలోనే వాటికి సంబంధించిన నివేదికను సమర్పించాల్సి ఉందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి సరిగ్గా అమలు అవుతుందా లేదా అని ఎన్నికల పరిశీలకులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారని, అధికారులందరూ జాగ్రత్తగా బాధ్యతతో వారికి కేటాయించిన విధులను సక్ర మంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్ని కల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోడల్ కోడ్ అతిక్రమించరాదని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలి. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే అధికారులందరూ ఎన్నికల కమిషన్ పరిధిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పరంగా ఎలాంటి కార్యక్రమా ల్లో పాల్గొనరాదని, అన్ని ప్రభుత్వ కార్యాలయ భవనాల్లోని రా జకీయ నాయకుల ఫొటోలు, వాల్‌పోస్టర్లు, పత్రాలు, ఇతరత్రా ఏవైనా ఉంటే వాటన్నింటినీ వెంటనే తొలగించాలన్నారు. జాతీయ నాయకులు మినహా అన్ని రాజకీయ సంబంధ విగ్రహాలకు ముసుగులు వేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులను ఎన్నికల్లో ఏం చేయాలి, ఏం చేయకూడదు అని అంశాలపై స్పష్టత ఇవ్వాలన్నారు. నియోజకవర్గ పరిధిలో మేనేజ్మెంట్ టీముల్లో అధికారులు, సిబ్బంది, పోలీసుశాఖ వారితో సమన్వయం చేసుకొని ఎలాంటి చిన్న పొరపాట్లు జరగకుండా ఎన్నికల విధులను నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణరావు, వివిధ శాఖల జిల్లా నోడల్ అధికారులు, ఆర్డీవోలు, ఈఆర్‌వోలు, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హంతకులను అన్నే కాపాడుతున్నాడు

- ప్రజాకోర్టులో వారికి బుద్ధి చెప్పాలి
- జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన చెల్లెళ్లు
- వివేకా మంచి మనిషి
- అలాంటి వ్యక్తిని అంత దారుణంగా చంపుతారనుకోలేదు
- వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సన్నిహితులు
- వివేకా సంస్మరణ సభకు భారీగా తరలివచ్చిన వివేకా అభిమానులు
- వైసీపీలో కలవరం

"దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తోబుట్టువుల కోసం పరితపించేవారు. వారి బాగోగులు చూసుకునేవారు. మేనత్తలను కూడా కంటికి రెప్పలా వివేకానందరెడ్డి కాపాడుకునేవారు. వారిద్దరూ చెల్లెళ్ల కోసం అంత తపిస్తే మరి సొంత చిన్నాన్న హత్య కేసులో నిందితులకు అండగా ఉంటావా..." అంటూ షర్మిల, సునీత భావోద్వేగంతో ప్రశ్నించారు. హంతకులను అన్నే కాపాడుతున్నాడని.. ప్రజాకోర్టులో వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



సమావేశానికి హాజరైన వారు



వివేకాకు నివాళులర్పిస్తున్న డాక్టర్ సునీత

కడప, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకు గురై ఐదేళ్ల అయింది. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు కడపలోని జయరాజ్‌గార్డెన్‌లో శుక్రవారం ఐదవ స్మారకోత్సవ మరియు జ్ఞాపకార్థ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ నేతలు మినహా వైఎస్ వివేకానందరెడ్డితో అనుబంధం ఉన్న, ఆయనతో కలిసి జర్నీ చేసిన వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేకాతో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తండ్రి హత్యలో నిందితులను కనిపెట్టేందుకు డాక్టర్ సునీతారెడ్డి చేసిన న్యాయ పోరాటాన్ని అభినందించారు. వివేకానందరెడ్డితో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, డాక్టర్ సునీతారెడ్డి భావోద్వేగ ప్రసంగం చేశారు. ఇక ఈ సమావేశానికి వైఎస్ వివేకా అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశాన్ని వివేకా కూతురు డాక్టర్ సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు వివేకాతో తమ అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, సీఎం సురేశ్‌నాయుడు, బీజేపీ నేత నాగోతు రమేశ్ నాయుడు, ముక్తియార్, విజయజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కంటతడి పెట్టించిన ప్రసంగం

వివేకానందరెడ్డితో తన చిన్ననాటి స్మృతులను ఆయన కూతురు డాక్టర్ సునీత, తండ్రి తరువాత చిన్నాన్నతో ఉన్న అనుబంధాన్ని వైఎస్ షర్మిలారెడ్డి సభాముఖంగా గద్గదస్వరంతో చెప్పడం సభికులను కంటతడి పెట్టించింది. నాన్నకు ఎప్పుడూ పులివెందుల, కడప జిల్లాలే ముఖ్యమని తాను అమెరికాలో ఉన్నప్పుడు బలవంతంగా తీసుకెళ్లినప్పటికీ వారం పదిరోజుల్లోపే పులివెందులకు వచ్చేసేవాడని సునీత అన్నారు. "నా కొడుకు ఆరోగ్యం బాగలేనప్పుడు మాతో మూడు నెలలు ఉన్నాడు. పక్కకు పోకుండా కంటికి రెప్పలా చూసుకున్నాడు. వాడు చనిపోయినప్పుడు ఎంతో బాధపడ్డాడు. తల్లిదండ్రుల కోసం అప్పుడే ఇండియాకు వచ్చేశాం. మా నాన్నకు కమ్యూనిస్టు భావాలు ఉన్నాయి. నేను 9 చదివేటప్పుడు కారల్ మార్క్స్ బుక్స్ ఇచ్చి చదవమన్నాడు. పులివెందులలో భూగర్భ డ్రైనేజీ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు గురించి 1993, 1994లోనే నాతో చర్చించేవారు. 1989-90లోనే సేంద్రియ వ్యవసాయం, డ్రిప్‌పై చెప్పేవారు. పులివెందులను ఎలా అభివృద్ధి చేయాల, కడపజిల్లాలో హత్యలు, వయొలెన్స్ లేనిది చూడాలనేదే ఆయన ఉద్దేశ్యం" అన్నారు.

షర్మిల మాట్లాడుతూ.. చిన్నాన్న వివేకానందరెడ్డి మంచి మనిషి. నన్ను పెంచారు. చిన్నాన్న కోసం... ఏదైనా సమస్య వచ్చి ఎవరైనా వస్తే రాత్రిపగలు అని చూడకుండా ఉన్న వెహికల్‌లో జనాలను కిక్కిరిసి వేసుకుని.. వచ్చిన వారికి చోటు లేకున్నా సరే ఎక్కించుకుని అది కలెక్టర్ ఆఫీసా, ఆర్డీవో ఆఫీసా, ఎమ్మార్వో ఆఫీసా అని చూడకుండా ఆఫీసులకు వెళ్లి వారికి పనిచేసేవారు. చనిపోయే ముందు చిన్నాన్న నన్ను కలిశారు. షమ్మీ నువ్వు కడప ఎంపీగా పోటీ చేయాలంటూ బతిమలాడారు. అన్నీ అనుకూలిస్తే సరేలే అని చెప్పాను. అలాంటి చిన్నాన్నను దారుణంగా హత్య చేశారు." అంటూ బాధపడ్డారు.



ఎర్రకోటపల్లె పంచాయతీలోని చీరల పంపిణీలో వలంటీర్లు, వైసీపీ నాయకులు

చీరల పంపిణీపై ఎంపీడీవోకు ఫిర్యాదు

కలకడ, మార్చి 15: మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ కోపూరివాండ్లపల్లెలో ఓటర్లకు వలంటీర్లు, వైసీపీ నాయకులు శుక్రవారం చీరలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డికి మాజీ జడ్పీటీసీ తిరుపతినాయుడు ఫిర్యాదు చేశారు. ఇందులో గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లు ఉన్నట్లు ఆధారాలను ఎంపీడీవోకు సమర్పించినట్లు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా చీరల పంపిణీపై ఫిర్యాదు వచ్చినట్లు స్పష్టం చేశారు. విచారణ జరిపి వలంటీర్లపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.

శాస్త్రోక్తంగా అంకురార్పణ



స్వామివారికి అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ, మార్చి 15: మండలంలోని తరిగొండలో కొలువైన లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామివారికి అంకురార్పణ కార్యక్రమాన్ని టీటీడీ వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వస్తివాచనం, పుణ్యాహవచనం, వాస్తుహోమం, అగ్నిప్రతిష్ఠ, యాగశాల ప్రవేశం, రక్షాబంధనం కార్యక్రమాలను నిర్వహించి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరగాలని సకల దేవతలను ఆహ్వానించారు. అనంతరం అంకురార్పణను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగాలని ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయాధికారి కృష్ణమూర్తి కోరారు.

నమ్మించి మోసం చేశాడు

- న్యాయం చేయాలంటూ ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు

రాయచోటిటౌన్, మార్చి 15: నమ్మించి నిండా ముంచాడు.. సాయం కోరి వెళ్తే మత్తు మందు ఇచ్చి మోసం చేయడమే కాకుండా స్పృహలేని సమయంలో అశ్లీల ఫొటోలు తీసి ప్రతి రోజు మానసికంగా వేధిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నాడంటూ శుక్రవారం ఓ మహిళ ఎస్పీ కృష్ణారావును ఆశ్రయించింది. అనంతరం బాధితురాలు మీడియా ఎదుట వివరాలు వెల్లడించింది. ఆమె వివరాల మేరకు.. బతుకుదెరువు కోసం తన భర్తతో కలిసి మదనపల్లెలో కిరాణాషాప్‌తో పాటు హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తుండేవారము. అదేవీధిలో నివాసముంటూ శ్రీరామ్ ఫైనాన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న రామాపురం మండలం నల్లగుట్టపల్లెకు చెందిన లక్ష్మీనరసింహ అనే వ్యక్తి తరచూ తన షాపు వద్దకు వచ్చి వెళ్తూ సన్నిహితంగా ఉండేవాడని తెలిపింది. ఈ క్రమంలో తన భర్తకు తెలియకుండా లక్ష్మీనరసింహ తన వద్ద డబ్బులు తీసుకుంటూ తిరిగి చెల్లిస్తూ ఉండేవాడని, అంతేకాక తనను పూర్తిగా నమ్మించి తన పేరుతో ఒక బ్యాంకు ఖాతా ప్రారంభించి లావాదేవీలు జరుపుతూ చెక్కుబుక్కులు, ఏటీఎం కార్డులు అతని వద్దే పెట్టుకున్నట్లు ఆరోపించింది. ఈ క్రమంలోనే ఒకసారి ఇంటికి పిలిపించుకొని తనకు మత్తు మందు ఇచ్చి తన అశ్లీల ఫొటోలు తీసి బెదిరిస్తున్నాడని ఆరోపించింది. దీంతో చేసేది లేక భయపడి అతను అడిగినప్పుడల్లా అప్పులు తెచ్చి డబ్బులు ఇస్తూ వచ్చానని వివరించింది. ఫలితంగా అప్పులు తెచ్చిన వారి నుంచి అనేక ఇబ్బందులు పడుతూ ఆత్మహత్య కూడా చేసుకోబోయానని, తన భర్త కాపాడాడని తెలిపింది. ఈ విషయాలు తెలుసుకున్న తన భర్త తనను ఇంటి నుంచి గెంటేశాడని విలేకర్ల ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది.

గంజాయి మత్తులో యువత



- బీడీ, సిగరెట్‌కు ఎక్కించి తాగుతున్న యువత
- పట్టించుకోని అధికారులు

ఖాజీపేట, మార్చి 15: పక్క రాష్ట్రమైన తెలంగాణా లో గంజాయి డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతుంటే.. మన రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు సాగుతున్నా పట్టించుకునే నాధుడే లేరు. దీంతో యువత గంజాయి తాగుతూ మత్తుకు బానిసలుగా మారుతున్నారు. ఖాజీపేట మండల పరిధిలో గంజాయి, అక్రమ మద్యం యదేచ్ఛగా దొరుకుతుండడంతో యువత మత్తులో ఊగుతున్నారు. ఖాజీపేటకు అటు కమలాపురం, ఇటు బద్వేలు నుంచి గంజాయి ప్యాకెట్లు రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో ప్యాకెట్ డిమాండ్‌ను బట్టిరూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. ఇక వైసీపీ ప్రభుత్వం వచ్చాక మద్యం ధరలు బాగా పెరగడంతో క్వార్టర్‌కు రూ.200 చెల్లించాల్సిందే. గంజాయి ప్యాకెట్ అయితే అయిదు లేక ఆరుసార్లకు వస్తుంది. దీనికి తోడు మద్యం కంటే గంజాయి మత్తు ఎక్కువసేపు ఉంటుందని.. యువత ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. బీడీ, సిగరెట్లలో ఉన్న పొడిని తొలగించి అందులోకి గంజాయిని ఎక్కించి బహిరంగ ప్రదేశాల్లో తాగుతున్నారు. కొంత మంది యువకులు మద్యం, గంజాయి సేవించి మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని చెబుతున్నారు.

తూతూ మంత్రంగా చర్యలు

మండలంలో అక్రమంగా గంజాయి, మద్యం విక్రయిస్తున్నా ఎటువంటి చర్యలు లేవు. తూతూ మంత్రంగా మద్యం బాటిళ్లు పట్టుకోవడం, కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం తప్ప వీటిని నియంత్రించేందుకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోకపోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే యువత చెడు అలవాట్లకు బానిసలైపోతారని చర్చించుకోవడం విశేషం. దీనిపై ఖాజీపేట సీఐ రామాంజలును వివరణ కోరగా.. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని.. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. తాము కూడా ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు చేపడతామని తెలిపారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న గంజాయి ఆకు

గుట్టుగా.. గుట్కా రవాణా

- తెలంగాణ, కర్ణాటక నుంచి దిగుమతి
- పట్టణాలకు, గ్రామాలకు యథేచ్ఛగా సరఫరా
- పులివెందులలో జోరుగా విక్రయాలు



పులివెందుల టౌన్, మార్చి 15: పులివెందుల ప్రాంతంలో గుట్కా అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొంతమంది సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో అక్రమ వ్యాపారాన్ని ఎంచుకున్నారు. నిషేధిత గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్ తదితర ప్యాకెట్లను బెంగుళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ కొంతమంది వ్యాపారులు ఆ సరుకును రాత్రిపూట రహస్యంగా గ్రామాలకు, పట్టణాలకు చేరవేస్తున్నారు. రిటైల్ వ్యాపారులు కొంతమంది ఆ సరుకును విక్రయిస్తున్నారు.

పులివెందుల పట్టణంలో పలు టీ దుకాణాలు, కిరాణ కొట్లు, బండి బంకులలో గుట్టుగా విక్రయాలు సాగిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు పై నుంచి వచ్చిన సరుకును రహస్యంగా గోడౌన్లలో దాచి అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. బిస్కెట్లు, బ్రెడ్లు తదితర తినుబండారాల వ్యాపారం చాటున గుట్కా, ఖైనీ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. పొగాకుతో తయారు చేసిన ఈ ప్యాకెట్లను తీసుకున్న వ్యక్తులు మత్తుకు బానిసలై నిత్యం కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు అత్యధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో పోలీసులు దాడులు చేసిన ప్రతిసారి భారీ మొత్తంలో గుట్కా ప్యాకెట్లు దొరికేవి. ఇటీవల కాలంలో పోలీసుల దాడులు లేకపోవడం, అధికారులు దృష్టి సారించక పోవడంతో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు గుట్కా విక్రయాలపై దాడులు చేసి యువతను కాపాడాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పులివెందుల అర్బన్ సీఐ శంకర్ రెడ్డిని వివరణ కోరగా.. తాను ఇటీవలే బాధ్యతలు చేపట్టానని.. ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అమ్మకానికి సిద్దంగా ఉన్న గుట్కా ప్యాకెట్లు

68 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన రేషన్ బియ్యం బస్తాలతో విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), మార్చి 15: కడప విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 68 రేషన్ బియ్యం బస్తాలను సీజ్ చేశారు. కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి మాసుంబాషా ఆదేశాల మేరకు శుక్రవారం కడప సీఎస్‌డీటీతో కలిసి దాడులు నిర్వహించారు. చెన్నూరు వనంవీధిలో కాటం బ్రహ్మయ్య అనే వ్యక్తి రేషన్‌కార్డుదారుల నుంచి బియ్యాన్ని సేకరించి ఓ ఇంట్లో ఉంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశారు. ఇంట్లో ఉన్న 68 రేషన్ బియ్యం బస్తాలను సీజ్ చేశారు. దీని విలువ రూ.1,45,600 ఉన్నట్లు తెలిపారు. అనంతరం బ్రహ్మయ్యను చెన్నూరు పోలీసుస్టేషన్‌లో అప్పగించగా పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్రెడ్డి, అశోక్‌కుమార్, మనోజ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి..20 మంది అరెస్టు

- రూ.2.40లక్షల నగదు స్వాధీనం
- వాహనాలు సీజ్

కొండాపురం, మార్చి 15: మండలంలోని ఎనమలచింతల గ్రామం శివార్లలో జరుగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి పోలీసులు భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 20 మందిని అరెస్టు చేసి.. వారి వద్ద నుంచి రూ.2.40లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మూడు ఫోర్‌వీలర్లు, రెండు టూవీలర్లు సీజ్ చేసి.. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పీలేరు, మార్చి 15: మద్యానికి బానిసైన పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లెకు చెందిన ఎం.రాజశేఖర్(34) గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిస కావడమే కాకుండా తరచూ కుటుంబస భ్యులతో గొడవలకు పాల్పడే రాజశేఖర్ గురువారం రాత్రి తన ఇంటిపైనున్న గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. ఈ విషయం శుక్రవారం ఉదయం కనుగొన్న కుటుం బసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజశేఖర్ మృతదేహానికి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 15: అనంతపురం నగరంలోని ఆర్డీటీ అనంత క్రీడాగ్రామంలో రాష్ట్ర సబ్‌జూనియర్ బాల, బాలికల జట్ల క్రీడాకారుల ఎంపిక పోటీలను శుక్ర వారం నిర్వహించారు. సుమారు 13 ఉమ్మడి జిల్లాల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హాజరుకావడంతో తీవ్ర పోటీ నెలకొంది. ఎంపిక చేసిన క్రీడాకారుల వివరాలను ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు ప్రకటిం చారు. బాలుర జట్టులో నానిబాబు, రోహిత్, జ్యోతి ప్రకాష్, జనార్ధన్ (విజయ నగరం జిల్లా), కుష్వంత్ (కృష్ణా జిల్లా), కార్తీక్, పార్థసారధి (గుంటూరు), శశి, మురళీ (అనంతపురం), వంశీ (చిత్తూరు), జగన్ (కర్నూలు), పవన్ (శ్రీకాకుళం), ధీరజ్ (నెల్లూరు), చరణ్‌తేజ (ప్రకాశం), బద్రినాథ్ (కడప), సాత్విక్ (కర్నూలు), మనోజ్ (విశాఖపట్నం), వీరబాబు (తూర్పుగోదావరి) ఉన్నారు.

బాలికల జట్టులో.. దేవిప్రియ (శ్రీకాకుళం), చైతన్య, తేజస్విని, భువనేశ్వరి (విజయనగరం), తిరుమల (గుంటూరు), దీవెన, వాసంతి (ప్రకాశం), సానియా, భాగ్యలక్ష్మి (అనంతపురం), ఉమ, హిందూ, హేమలత (చిత్తూరు), పూర్ణిమ (తూర్పుగోదావరి), వినయ, సన్నీ (కడప), కృత్తిక (కర్నూలు) ఉన్నారు. ఈ నెల 20 నుంచి ఆర్డీటీ స్టేడియంలో శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, ఈనెల 28 నుంచి మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, చిత్తూరు రమేష్, కృష్ణా జిల్లా సాంబశివరావు, గుంటూరు నరసింహారెడ్డి, పీడీలు గోపాల్‌రెడ్డి, విజయ్, లతాదేవి, చంద్ర, సంజీవరాయుడు, సురేష్, కోచ్‌లు బద్రి, మహేష్, సింహాద్రి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 15: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలానికి చెందిన ఓ బాలిక(17) గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

తూనికలు - కొలతల్లో మోసపోవద్దు



తూకాలు చూపిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి

కడప (నాగరాజుపేట), మార్చి 15 : తూనికలు, కొలతల విషయంలో ప్రజలు మోసాలకు గురి కావద్దని స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వీఆర్‌ఆర్ఎం ఫిజియోథెరపీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం నిత్యం ఎన్నో రకాల వస్తువులను కొనుగోలు చేస్తుంటామని, అయితే తూనికలు, కొలతల్లో మోసాలకు గురి కాకుండా తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. 1986 వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం నాణ్యమైన వస్తువులను పొందడం వినియోగదారుల హక్కు అన్నారు. మార్కెట్లో ఉన్న వస్తువులను వినియోగించేటప్పుడు ఏవైనా లోటుపాట్లు కనిపిస్తే ఆ వస్తువులను లేదా సేవలను గురించి ప్రశ్నించే హక్కు వినియోగదారుడికి ఉందన్నారు. దుకాణంలో కిలో కందిపప్పు నిజానికి 800 గ్రాములు ఉంటుందని, పాలు, కిరోసిన్ కొలతల విషయంలో తరుగు సర్వసాధారణంగా మారిపోయిందన్నారు. పెట్రోలు బంకుల్లో ఆపరేటర్లు చేతివాటంతో వాహనదారులు ఎంతో కొంత నష్టపోతుంటారన్నారు. రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన ధాన్యాన్ని అమ్మేటప్పుడు 70 కిలోల బస్తాకు దాదాపు ఆరు, ఏడు కిలోల వరకు తూకంలో మోసాల కారణంగా రైతులు నష్టపోతుంటారన్నారు. ఇలాంటి మోసాలను అరికట్టే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్, స్టెప్ మేనేజరు సుబ్బరాయుడు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ వివేకాకు ఘన నివాళులు



తండ్రి వైఎస్ వివేకా సమాధిపై
పూలమాల వేస్తున్న వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి

పులివెందుల టౌన్, మార్చి 15: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి 5వ వర్థంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు ఘన నివాళులు అర్పించారు. శుక్రవారం పట్టణంలోని వివేకా సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, బావమరది శివప్రకాష్‌రెడ్డి, జగన్ బాబాయ్ వైఎస్ సుధీకర్‌రెడ్డి, ఇతర కుటుంబ సభ్యులు, అభిమానులు నివాళులు అర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వివేకా పార్క్‌లోని వివేకానందరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంతర్జాతీయస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



బంగారు పతకాన్ని అందుకుంటున్న నాగరాజు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 15: మండలంలోని దప్పేపల్లె గ్రామం మేడిమాకులగుంతకు చెందిన కొరకుంట నాగరాజు అనే యువకుడు అంతర్జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల సంయుక్త భారతీయ కేఎల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మస్థలలో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్‌లో 74 కిలోల విభాగంలో 380 కిలోలు ఎత్తి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. దీంతో ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు ఇంటర్ నేషనల్ స్థాయిలో ఎస్‌టీకేఎఫ్ నేపాల్ పోక్రాలో జరగబోవు పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 29న నేపాల్‌కు వెళ్లాల్సిన నాగరాజుకు ఆర్థికస్థోమత లేకపోవడంతో దాతలు సహకరించి ఆదుకోవాలని కోరుతున్నారు. సహాయం చేసేవారు 7075824889, 8340935277 నెంబరుకు కాల్ చేయాలని కోరుతున్నాడు.

జొన్నరైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

కడప(రూరల్) మార్చి 15: ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ ద్వారా హైబ్రిడ్ జొన్నలను రూ.3180ల మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని.. రైతులు రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మార్క్‌ఫెడ్ ఈ-ప్రొక్యూర్‌మెంట్ డీఎం నరసింహారెడ్డి తెలిపారు. జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పై మద్దతు ధరతో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వం సూచించిందన్నారు. ఈ మేరకు 15 నుంచి రైతు భరోసా కేంద్రాలలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ఆలయాల సందర్శనకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 15: ప్రత్యేక పుణ్యక్షేత్రాలు సందర్శనకు మదనపల్లెడిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తంబళ్లపల్లె మల్లయ్య కొండకు ప్రతి సోమవారం మదనపల్లె నుంచి ఉదయం 5.50 గంటలకు, 6.30 గంటలకు రెండు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అవి తంబళ్లపల్లె మల్లయ్యకొండ నుంచి సాయంత్రం 6 గంటల తర్వాత మదనపల్లెకు బయలుదేరి వస్తాయన్నారు. అలాగే అరుణాచల గిరిప్రదక్షిణం కోసం ప్రతి పౌర్ణమి రోజు మదనపల్లె నుంచి ఉదయం 9గంటలకు బయలుదేరి అనంతరం మరుసటి రోజు ఉదయం 4 గంటలకు మదనపల్లెకు చేరుకుంటుందని తెలిపారు. మరెన్ని వివరాలకు సెల్ నెంబర్లకు 7382875034, 7382876638, 7382877300 సంప్రదించాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



చెన్నూరు వద్ద టిప్పరులో తరలుతున్న ఇసుక

చెన్నూరు, మార్చి 15: నిబంధనలకు నీళ్లొదిలి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారులు అనుమతినిచ్చిన క్వారీలు, లేదా డంప్ యార్డుల నుంచే తీసుకుపోవాలి అనే నిబంధన ఉన్నా మండలంలోని పెన్నానది నుంచి ఇసుక పట్టపగలే రవాణా సాగుతోంది. హైవేలో ట్రాక్టర్లు, టిప్పర్లు తిరుగుతున్నా వాటిని ఆపేవారే లేరు. ప్రభుత్వ అనుమతి ఉందో, లేదో తెలియని పరిస్థితి. ఏ శాఖ అధికారులు కూడా తమకేమీ పట్టనట్లు ఉన్నారు. కనీసం వాటిని ఆపి అడిగే పరిస్థితి కూడా లేదు. దీంతో కొండపేట, బలసింగాయపల్లె, ములపాక, పుష్పగిరి ప్రాంతాల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు. అలాగే హైవేలో రేయింబవళ్లు ట్రాక్టర్లతో గ్రావెల్ తరలిస్తున్నా ఏ శాఖ అధికారులు కూడా పట్టించుకోలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఖాజీపేట మండలంలోని కొన్ని ట్రాక్టర్లు ఈ గ్రావెల్‌ను తీసుకువస్తున్నారు. ఇప్పటికైనా అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేసి ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా నిలపాలని పలువురు పేర్కొంటున్నారు.

పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం : డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 15: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక డీఈవో కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 18 నుంచి 30వ తేది వరకు జరగనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, జిల్లా వ్యాప్తంగా 58ఏ కేటగిరి, 55బీ కేటగిరి, 16 సీ కేటగిరి సెంటర్ల చొప్పున మొత్తం 129 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో జిల్లాలోని 492 పాఠశాలల నుంచి 22,466 మంది రెగ్యులర్ విద్యార్థులు, 3056 మంది పరీక్ష తప్పిన విద్యార్థులతో కలిపి మొత్తం 25,522 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు ఆయన తెలియజేశారు. అందులో 13,003 బాలురు, 12,519 మంది బాలికలు ఉన్నట్లు చెప్పారు.


జిల్లాలోని 129 పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులతో పాటు అడిషినల్ డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 10 రూట్స్ ఏర్పాటు చేసి కస్టోడియన్స్‌తో పాటు జాయింట్ కస్టోడియన్స్‌ను నియమించి పరీక్ష పేపర్ల స్టోరేజ్ కోసం 31 చోట్ల పాయింట్స్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన డెస్కులు ఏర్పాటుతో పాటు తాగునీటి సౌకర్యం, గాలి, వెలుతురు ఉండే విధంగా ఫ్యాన్లు, లైట్స్ సిద్ధం చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే పరీక్షలకు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఆదేశాలతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు ఉండకూడదన్నారు. విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకూడదని ఆయన సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డీఈవో కార్యాలయ ఏడీ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా చిన్నరెడ్డన్న



పీసీ రెడ్డన్న

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 15: పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా పి.చిన్నరెడ్డన్న ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం గుంటూరు హిందూ కళాశాలలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన 48వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా అన్నమయ్య జిల్లా రాయచోటి మాజీ ఎంఈఓ, పీఎస్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.చిన్నరెడ్డన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డిసుబ్బారెడ్డి, పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఇలియాస్‌రెడ్డి, రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రామాంజనేయరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ సుబ్బారెడ్డి, ఎన్వీ సుబ్బారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



18న వారాంతపు సంత హక్కుల వేలం

గాలివీడు, మార్చి15: ఈ నెల 18వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పశువుల, కూరగాయల వారాంతపు సంతలో సెస్సు వసూలు హక్కులను వేలం వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సురేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు పంచాయతీ పరిధిలోని పశువుల సంతకు రూ.2 లక్షలు, కూరగాయల సంతకు రూ.1.50 లక్షలు, బస్టాండు గేట్‌కు రూ.50 వేలు చొప్పున సోమవారం మధ్యాహ్నం 2 గంటల్లోపు పంచాయతీ కార్యాలయంలో చెల్లించిన వారు మాత్రమే వేలంపాటలో పాల్గొనడానికి అర్హులన్నారు.

రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సాయివికాస్ రెడ్డి

ఓబులవారిపల్లె, మార్చి 15: అనారోగ్యంతో బాధపడుతున్న మంగళంపల్లి హరిజనవాడకు చెందిన కోనేటి శాంతి కుమారుడు నిఖిల్‌కు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ నిర్వాహకుడు రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి రూ. 20 వేలు ఆర్థిక సాయం అందచేశారు. ముక్కావారిపల్లి పంచాయతీ తురకపల్లెలో ఒంటరి మహిళ షేక్ మహబూబ్‌జాన్ మోకాలి ఆపరేషన్‌కు 20 వేల రూపాయలు ఫౌండేషన్ అధినేత తనయుడు సాయివికాస్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీఆర్ మస్తాన్, చింత రాజారెడ్డి, జ్యోతి రమాదేవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలి రండి

సిద్దవటం, మార్చి 15: చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడిలో రేపు నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు టీడీపీ, జనసేన, బీజేపి నాయకులు కార్యకర్తలు తరలిరావలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి అల్లూరి నాగమన్ రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొంటున్నారు. నియోజకవర్గంలోని నాయకులందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

బలిజసేన జిల్లా కార్యదర్శిగా కొట్టే రాఘవ

రాయచోటి(కలెక్టరేట్), మార్చి15: అన్నమయ్య జిల్లా బలిజ సేన కార్యదర్శిగా తనను నియమించినట్లు కొట్టే రాఘవ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి మస్తాన్ రాయల్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు నరసింహకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బలిజల ప్రభావం చూపించాలన్నారు. జిల్లాలో బలిజల సంక్షేమానికి కృషి చేస్తానని తెలియజేశారు.

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Kandukuri Prabhavathamma W/o K. Venkateswarlu,** Kaspa Pandillapalli Village, Post, Lakkireddypalli Mandal, Annamayya District under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property.
SCHEDULE:- Annamayya District, erstwhile Y.S.R. Kadapa District, Lakkireddypalli Sub.Reg. Dist. Galiveedu Mandal & Village Polam at Settivarypalli in Sy. No. 910 an extent Ac. 0-01 1/2 cents or 72 Square yards vacant site. Bounded by: East– Rasta, West - Rasta, North - Site of Prabhakar, South - Site purchased by K. Akkayamma. Measuring : East - West = 32 cubits/48 feets North - South = 9 cubits/13 1/2 feets (Property covered under registered sale deed No. 839/2019 (S.R.O. Lakkireddypalli.)
C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

వినియోగదారులకు చట్టాలపై అవగాహన అవసరం

● డీఎస్‌వో రఘురాం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వో రఘురాం

రాయచోటి(కలెక్టరేట్), మార్చి15: వినియోగదారులు చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్‌వో రఘురాం తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఎస్‌వో కార్యాలయంలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఉపయోగించే ప్రతి వస్తువుపైన వినియోగదారుకు ప్రభుత్వం చట్టపరమైన హక్కును కల్పించిందన్నారు. చాలా మంది చట్టాలపై అవగాహన ఉన్నా ఆచరణలో పెట్టకపోవడం వల్ల మోసపోతున్నారన్నారు. ప్రజలను చైతన్య పర్చడంలో విద్యార్థులు, మీడియా ప్రముఖ పాత్ర పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎరువులు, పురుగు మందులు తదితరాల కొనుగోళ్ల సమయంలో బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసే వస్తువు తయారీ, తేదీ, గడువు ముగింపు తేదీ, వస్తువు నాణ్యత ప్రమాణాలు, రుచి, వాసన తదితరాలను గమనించాలని తెలిపారు. ఎవరైనా ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు అమ్మితే వెంటనే కన్స్యూమర్ ఫోరమ్‌కు ఒక్క కాల్ చేస్తే వస్తువు అమ్మకంలో ఎలాంటి మోసాన్ని అయినా అరికట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీఎం శ్రీరామమూర్తి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, పౌరసరఫరాల డీలర్లు, కన్స్యూమర్ వలంటరీ ఆర్గనైజర్స్ హోల్‌సేల్, రిటైల్ కిరాణా మర్చంట్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మహిళలతో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నేత మావులూరి విశ్వనాథ్

గాలివీడు, మార్చి15: కడపవాండ్లపల్లె దళితవాడ తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం గాలివీడు మండల పరిధిలోని కడపవాండ్లపల్లె దళితవాడలో సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి దాదాపు యాభై కుటుంబాల వారు కిలోమీటర్ల దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, రెడ్డెప్ప, స్థానిక ప్రజలు, మహిళలు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు ఉచితంగా వైద్య పరీక్షలు



టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శరత్

నందలూరు, మార్చి 15: క్షయవ్యాధి బాధితులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం తో పాటు మందులు కూడా ఉచితంగా ఇస్తామని రాజంపేట టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ కమల్ తెలిపారు. శుక్రవారం పొత్తపి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో టీబీ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలు పైబడి దగ్గు, రాత్రి పూట జ్వరం రావడం, ఆకలి మందగించడం బరువు తగ్గడం వంటి లక్షణాలున్నవారికి నందలూరు ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలలు ఆశ వర్కర్ పర్యవేక్షణలో మందులు మింగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వెంకటనారాయణ, టీబీ సూపర్వైజర్ జయప్రకాశ్, జిల్లా ప్రోగాం కోర్డినేటర్ చెన్నారెడ్డి, ల్యాబ్ సూపర్వైజర్ మల్లికార్జున, శివరాం, ఎంఎల్‌హెచ్‌పి ఆరిఫ్, ఏఎన్‌వో ఆశ పాల్గొన్నారు.

గురజాడ నగర్‌లో పాముల బెడద..



వీధిలోని పిల్లలు చంపిన పాములు

నందలూరు, మార్చి 15: మండలంలోని నాగిరెడిపల్లి పంచాయతీ గురజాడనగర్‌లో పాము పిల్లలు రోడ్డుపై దర్శనమిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదే వీధిలో పాఠశాల ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని బిక్కుబిక్కుమంటున్నారు. ప్రతి రోజు దాదాపు 20 నుంచి 30 వరకు పాము పిల్లలు రోడ్డుపై వస్తాయని, ప్రతి రోజు పిల్లలు వాటిని చంపుతున్నారని స్థానికులు వాపోతున్నారు. గురువారం సాయంత్రం సైతం పాము పిల్లలు రావడంతో పిల్లలు వాటిని చంపేందుకు ఎగబడ్డారు. ప్రధాన కాలువలో చెత్త చెదారంతో నిండిపోయి ఉండడంతో పాములు ఎక్కువగా సంచరిస్తున్నాయని అంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తూతూ మంత్రంగా ఓటర్ల అవగాహన సదస్సు

ఖాజీపేట, మార్చి 15: కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా రిగ్గింగ్ కాకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడికక్కడ ఓటర్లకు అవగాహన నిర్వహించాలని చెబుతున్నా అందుకు విరుద్ధంగా ఖాజీపేటలో నిర్లక్ష్యంగా సదస్సు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే... ఖాజీపేట ఉర్దూ పాఠశాలలో 194, 195, 196, 197 బూత్‌లలో 2019 ఎలక్షన్‌లో 60 శాతం మాత్రమే పోలింగ్ కావడంతో అక్కడ ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించి ఓటర్లలో చైతన్యం తీసుకురావాలని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. దీంతో శుక్రవారం ఉర్దూ పాఠశాలలో ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడ విశేషమేమిటంటే ఆ పోలింగ్ బూత్‌లలోని ఓటర్లకు సమాచారం ఇవ్వకపోగా తూతూ మంత్రంగా విద్యార్థులు, రెవెన్యూ సిబ్బందిని ఉంచి అవగాహన సదస్సు నిర్వహించారు. దీంతో ఇదేనా చైతన్యం తీసుకురావడమంటే ఇదేనా అని ఓటర్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ సమావేశంలో ఇద్దరు మాత్రమే ఓటర్లు ఉండడం మరో విశేషం. ఏది ఏమైనా ఓటర్లను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది. ఓటుకు నోటు అసలే వద్దు, నీతి, నిజాయితీగా ఓటు వేద్దాం, మా ఓటు మీ భవిష్యత్తు అంటూ నినాదాలు చేస్తూ ఉర్దూ పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు, తహసీల్దారు వెంకటలక్ష్మి, ఏవో నాగార్జున, వీఆర్వోలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా ఉపాధి హామీ పనులు తనిఖీ

ఖాజీపేట, మార్చి 15: మండల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషణ్‌రెడ్డి ఆకస్మిక ంగా తనిఖీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీలోని ఫారెస్టు రోడ్డులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించడంతోపాటు పండ్ల తోట పెంపకం రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం ఆరు గంటలకు వచ్చి 11 గంటలకు ఇంటికి వెళ్లేలా చూడాలని, కూలీల వెంట తాగునీరు తెచ్చుకునేలా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓఆర్ఎస్ ప్యాకెట్లు తెచ్చి కూలీలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఏపీడీ జుబేదా, ఏపీవో చంద్రశేఖర్, టీఏలు సుబ్బారావు, గురుబాబు, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 అవకతవకలపై విచారణ జరిపించాలి



విలేకరులతో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 15: గ్రూప్-1 2018 పోస్టుల మెయిన్స్‌లో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జి తో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం జాప్ కార్యాలయనలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగల జీవితాల తో చెలగాటమాడుతోందన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ పూర్తి నిర్లక్ష్యమేనని, 2018 గ్రూప్ మెయిన్ రద్దు చేయాలని, మళ్లీ నిర్వహించాలని హైకోర్టు తీర్పు దానికి నిదర్శనమన్నారు. దాదాపు 49వేల ఓఎంఆర్ షీట్‌లలో మూల్యాంకనంలో అవకలవకలు ఏర్పడ్డాయని, అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో మెయిన్ పరీక్షనే రద్దు చేసిందన్నారు. పెద్దల హస్తం లేనిదే ఇలా జరిగి ఉండదని అభిప్రాయపడ్డారు. కష్టపడి కుటుంబాలకు దూరంగా ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గి పరీక్షలు రాస్తే ఇలాంటి చర్యలు నిరుద్యోగుల బలన్మరణాలకు దారి తీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణలో పూర్తి వైఫల్యం స్పష్టమవుతోందన్నారు. కోర్టు తీర్పు ప్రకారం ఆరు నెలల్లో ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, కార్యర్శి చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షుడు సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ కాపు బలిజల ద్రోహి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 15 : ముద్రగడ కాపు బ లిజల ద్రోహి అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఆరోపించారు. శుక్రవా రం కడప నగరం హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌తో లోపాయికార ఒప్పందం వల్లనే గతంలో కాపు ఉద్యమం ముద్రగడ నడిపారన్నారు. ముద్రగడ జగన్ కోవర్టు అన్నారు. ముద్రగడ మంత్రిగా ఉన్నప్పుడు కాపులకు నో ఎంట్రీ అని బోర్డు పెట్టిన విషయం గుర్తు చేశారు. మొదటినుంచి జగన్ కనుసన్నల్లోనే ఆయన నడుస్తున్నారని చెప్పారు. ముద్రగడకు టికెట్ వచ్చినా డిపాజిట్ కూడా రాదని స్పష్టం చేశారు. కాపు, బలిజలు ముద్రగడను తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. బలిజల ద్రోహి పార్టీగా వైసీపీని అభివర్ణించారు. అలాంటి పార్టీలో ముద్రగడ చేరడం సిగ్గుచేటని తెలిపారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కడపలో మొల్ల పేరుతో తెలుగు అకాడమీ ఏర్పాటు చేయాలి

కడప (కల్చరల్), మార్చి 15 : కడపలో మహాకవయిత్రి మొల్ల పేరుతో తె లుగు అకాడమీ ఏర్పాటు చేసి గోపవరం మండలానికి మొల్ల గోపవరం మండలంగా పేరు పెట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించినట్లు మొల్ల సాహితీ పీఠం అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మొల్ల పేరు పెట్టాలని, మొల్ల సాహిత్య పీఠం కార్యాలయానికి ఐదు సెంట్లు స్థలం కేటాయించాలని కోరామన్నారు.

మదనపల్లె పురపాలక సంఘము

ఈ- ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 1394/E1/2020 తేది: 11-03-2024

మదనపల్లె పురపాలక సంఘము నందు క్రింద తెలిపిన పనులకుగాను ఈ- ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

వ. నెం.	Funds	Tender ID Nos.	పనుల సంఖ్య	పనుల అంచనా మొత్తము (ECV)
1.	General Funds	732114,732115.732116,732118, 732155, 732319.732344.732522, 732540, 732544, 732549, 732553	11	89.83 లక్షలు

పై పనులకు సంబంధించిన పూర్తి వివరముల కొరకు వారి e procurement market place నందు చూడవలెను మరియు ఆఫీసు పని వేళలయందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు.

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు మొదటితేది : 11-03-2024 సా॥4.00గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు చివరితేది : 26-03-2024 ఉ॥11.00గం॥లకు
బిడ్ డాక్యుమెంట్ స్వీకరించుటకు చివరి తేది : 26-03-2024 ఉ॥11.15గం॥లకు

షరతులు : ఏ కారణము తెలుపకుండా టెండరును పాక్షికముగా కాని, పూర్తిగా కాని రద్దుపరచుటకు/నిరాకరించుటకు కమీషనరు వారికి పూర్తి అధికారములు కలవు.

సం/- **కమీషనర్,** మదనపల్లె పురపాలకసంఘం

పౌష్టికాహారంతో మెరుగైన భవిష్యత్తు



చిట్వేలి: కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజేశ్వరి

చిట్వేల్, మార్చి 15: పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం, దాంతో ఉత్తమ భవిష్యత్తు సాధ్యమని సీడీపీవో రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం నగిరి పాడు గ్రామ పంచాయతీ, కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పోషణ పఖ్వాడా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాలను రోజువారా ఆహారంలో భాగం చేసు కుంటే ఆరోగ్యం పటిష్టంగా ఉంటుందన్నారు. ప్రతి తల్లి తమ పిల్లల ఆరోగ్యం కోసం మంచి ఆహారం ఇంట్లోనే తయారు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ వన్ సూపర్‌వైజర్ వ సుంధరమ్మ, కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్ర ధానోపాధ్యాయులు హేమలత, సునంద, కవిత, అంగన్వాడీ వర్కుర్లు సుజన, సుజాత, సాయి కుమారి, వసంత కుమారి, భాగ్యమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరం



రైల్వేకోడూరు: మహిళలతో చర్చిస్తున్న సీడీపీఓ సౌభాగ్యమ్మ.

రైల్వేకోడూరు(రూరల్): తల్లిపాలు పిల్లలకు ఆరోగ్యకరమని రైల్వేకోడూరు సీడీపీఓ టి.సౌభా గ్యమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని బుడుగుంటపల్లిలోని అంగన్వాడీకేంద్రంలో పోష ణ్ పఖ్వాడా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాల విశిష్టతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ప్రభు త్వం అందించిన నిత్యావసర సరుకుల వివరా లు అడిగి తెలుసుకున్నారు. సెక్టార్ కార్యదర్శి రత్నమ్మ, మహిళలు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సిద్ధిగాళ్ల శ్రీనివాసులు

రాయచోటిటౌన్, మార్చి 15: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అనుమతులు లేని ప్రైవేట్ ఆసుపత్రు లు, మెడికల్ మాఫియాగా మారాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు, ల్యాబ్‌లు నిర్వహిస్తూ, టెస్టుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో నామమాత్రపు తనిఖీలు చేస్తూ, నోటీసులతో కాలం గడుపుతున్నారే తప్ప, ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అనుమతులు లేని ప్రైవేటు ఆసుపత్రులపై విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు బత్తల వెంకట్రమణ, యపరాల పుల్లయ్య, అనిల్, సురేంద్ర, సుబాన్‌బాషా పాల్గొన్నారు.

రాజంపేట ఆర్టీసీ డిపోకు రూ.13.77 లక్షలు ఆదాయం

రాజంపేట, మార్చి 15: మహాశివరాత్రి హత్యరాల, తలకోన, గుండాల కోనకు ప్రత్యేక బస్సులు నడిపినందుకు రాజంపేట ఆర్టీసీ డిపోకు రూ.13,77,221 ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ రమణయ్య ప్రకటనలో తెలిపారు. హత్యరాలకు 15 బస్సులు, తలకోన, గుండాలకోనకు 10 చొప్పున ప్రత్యేక బస్సులు నడిపినట్లు తెలిపారు. హత్యరాల సర్వీసుల ద్వారా రూ. 5,98,662, గుండాలకోన సర్వీసులతో రూ. 4,67,309 తలకోన మార్గంలో 3,17,250 ఆదాయం వచ్చిందన్నారు.

రక్త పరీక్షలు మాన్యువల్‌గా నిర్వహించండి



ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కొండయ్య

గాలివీడు, మార్చి15: రక్తహీనత పరీక్షలు డిజిటల్ మీటర్ పద్ధతిలో కాకుండా మాన్యువల్‌గా నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కొండయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని గురుగుపల్లి (పందికుంట) సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కు కార్పొరేట్ వైద్యం అందజేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై డాక్టర్ స్రవంతిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ శిబిరంలో దాదాపు 250 మంది రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కండి : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన అధికారులు

రైల్వేకోడూరు, మార్చి 15: ఎన్నికలకు అధికారులందరూసమాయత్తం కావాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేం ద్రంలో నిర్వహించిన వీడియో కాన్ఫ రెన్స్‌కు రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం స్ట్రాంగ్ రూములు, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, తదితర విషయాలపై అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎన్నికల అధికారిణి లీలారాణి, ఐదు మండలాలకు చెందిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదిరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఎంఈఓలు చక్రేనాయక్,వెంకటసుబ్బయ్య

లక్కిరెడ్డిపల్లె మార్చి 15: ఉత్తమ పలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల విద్యాశాఖ అధికారులు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ సోమవారం నుంచి జరుగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు అందరూ సిద్ధంగా ఉండాలని ఏడాది పాటు చదివిన చదువు 7 రోజుల్లో మీ భవిష్యత్‌కు బంగారు బాటగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు ముగిసినంత వరకు ఆరోగ్యాన్ని కాపా డుకోవాలన్నారు. 10 వ తరగతి భవిష్యత్తుకు పునాదిరాయి అని, ఇప్పుడు ఎంత కష్ట పడితే అంత మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రీఫైనల్ పరీక్షల్లో 590 పైబడి మార్కు లు సాధించిన విద్యార్థులు కేజీబీవీలో 10, ఏపి మోడల్ స్కూల్‌లో 20 మంది విద్యార్థు లు ఉన్నారని పబ్లిక్ పరీక్షల్లో కూడా మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని వారు సూచించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌లో దాత ఆంజనేయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాళ్లు కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరుకు బీజేపీ టికెట్టు కేటాయించాలి



మాట్లాడుతున్న గడ్డం చంగల్‌రాజు

రైల్వేకోడూరు, మార్చి 15: బీజేపీ టికెట్టును రైల్వేకోడూరుకు కేటాయించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం చంగల్‌రాజు కోరారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004 నుంచి తండ్రి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ తప్ప వేరేవాళ్లు గెలిచిన దాఖాలు లేవని తెలిపారు. ఈ ఎనిక్నకల్లో రైల్వేకోడూరులో బీజేపీ అభ్యర్థికి ఇస్తే గెలిపించుకోవడం కోసం అన్ని సామాజిక వర్గాలు ఎదురుచూస్తున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని అంతం చేయాలన్న లక్ష్యంతో ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు ఓడించి తీరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దాసరాజు జయప్రకాష్ నారాయణవర్మ, ప్రజాపోరు అసెంబ్లీ కన్వీనర్ తోట శ్రీనివాసులు, అసెంబ్లీ కార్యదర్శి జోగినేని సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు నాగినేని బాలసుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు శంకర్‌రాజు, తోట లక్ష్మీనారాయణ, వరికూటి మల్లికార్జున, సాయిఆచారి, బాబుఆచారి, సాయం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధ్యాయ నియామకాలు

రైల్వేకోడూరు, మార్చి 15: హెచ్ఎంఎం ఎయిడెడ్ హైస్కూలులో ఉపాధ్యాయ నియామకాలు పారదర్శకంగా జరిగాయని స్కూలు కరస్పాండెంట్ దేవసుందరం తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ క్రిస్టియన్ కమిటీ వారు గత ఫిబ్రవరి 24న తనను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేయగా, ఈ నెల 12న్న కోర్టు తమకు అనుకూలంగా స్టే ఆర్డర్ ఇచ్చిందని వివరించారు. హెచ్ఎంఎం హైస్కూలు విషయం లో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. ప్రభుత్వం పది ఉపాధ్యాయ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. అర్హులకు మాత్రమే పోస్టింగ్ ఇచ్చారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలోనే పరీక్షలు, ఇంటర్వ్యూలు జరిగాయని తెలిపారు. తనకు తెలియకుండా తన కుమార్తె కూడా దరఖాస్తు చేసుకుంటే దాన్ని తిరస్కరించి అర్హులకు ఇచ్చామని తెలిపారు. అన్ని పారదర్శకంగానే జరిగాయని తెలిపారు.

హత్యరాల ఆలయ ఆదాయం రూ. 15.98 లక్షలు

రాజంపేట, మార్చి 15: మహా శివరాత్రి సందర్భంగా హత్యరాల కామాక్షి త్రేతేశ్వర స్వామి ఆలయానికి రూ.15,98,944 ఆదాయం వచ్చిందని ఆలయ చైర్మన్ వెలగచర్ల వెంకటసుబ్బారెడ్డి ఆలయ ఈవో కొండారెడ్డి తెలిపారు. హుండీ ద్వారా రూ.4,20,838, టికెట్ల ద్వారా రూ.49,526 టెంకాయలు, లడ్డూల వేలంతో రూ.7.65 లక్షలు ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

'ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్‌ను తొలగించాలి'

రాజంపేట, మార్చి 15: ఓపెన్ స్కూల్ పరీక్షల్లో అవినీతిని ప్రోత్సహిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజును విధుల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఐటీఐ కాలేజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులను పాస్ చేపిస్తామని ఒక విద్యార్థి నుంచి 12 నుంచి 15 వేల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. హాల్ టికెట్లు కావాలంటే వెయ్యి నుంచి రెండు వేల రూపాయలు ఇవ్వాలని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు చెప్పడం దారుణమన్నారు. జిల్లా కోఆర్డినేటర్ రాజంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో రహస్యంగా సమావేశం ఏర్పాటు చేసి వసూళ్లను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు గౌరీ శంకర్, చంగయ్య, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లకు అనుమతులు నిలిపివేయాలి

వీరబల్లి, మార్చి15: వాల్టా చట్టానికి వ్యతిరేకంగా ఇసుక తవ్వకాలు చేస్తూ ప్రతిమ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సిబ్బంది గత ఆరు నెలలుగా వీరబల్లి మండల రైతులను వేధిస్తున్నారని జైభీమ్ భారత్ పార్టీ రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వీరబల్లి మండలంలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే జాతీయస్థాయిలో గుర్తింపు ఉన్న మామిడి రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వస్తాయని, భూగర్భజలాలు అడుగంటి ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని గతంలో విరమించుకున్నారన్నారు. గత ఆరు నెలల నుంచి ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే వీరబల్లి మండలంలో రీచ్‌లు పెట్టాలని ఆ సంస్థ మొండిగా వ్యవహరిస్తోందన్నారు. వాల్టా చట్టానికి వ్యతిరేకంగా అనుమతులు పొందితే హైకోర్టులో పిటిషన్ వేసి వీరబల్లి మండల రైతుల సమస్యలను పరిష్కరించేందుకు జైభీమ్ భారత్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

నలుగురి బైండోవర్

చిన్నమండెం, మార్చి15: మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన ఓర్సు వెంకటాద్రి మరో ముగ్గురిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్న ఉద్దేశంతో వారిని తహసీల్దార్ ముందు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా సీతారామ విగ్రహ ప్రతిష్ఠ

ఖాజీపేట, మార్చి 15: మండల పరిధిలోని పత్తూరులో సీతారామ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం పూజలు చేయడంతోపాటు భక్తులకోసం కోలాటం నిర్వహించారు. భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠతో పాటు సీతారాముల కల్యాణం, గరుడ స్తంభం ఏర్పాటు చేయనున్నారు.



కపిలతీర్థం ఆలయం వద్ద ఓట్లు అభ్యర్థిస్తున్న ఆరణి శ్రీనివాసులు

'ఆరణి'తో అడ్జస్టవ్వాలా? వద్దా?

- కూటమి నాయకుల మల్లగుల్లాలు
- ఫోన్ మంతనాల్లో జనసేన అభ్యర్థి

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా ఎంపికైన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో సర్దుకు పోవాలా, లేదా అన్న మీమాంసలో కూటమి నేతలు ఉన్నారు.స్థానికులను కాదని చిత్తూరుకు చెందిన వ్యక్తిని తిరుపతి అభ్యర్థిగా తీసుకు రావడం టీడీపీ-జనసేన నాయకుల్లో అసమ్మతి కుంపటి రాజేసిన విషయం తెలిసిందే.అభ్యర్థికి సహకరించకపోతే తీవ్రమైన చర్యలు తీసుకుంటామంటూ ఇరు పార్టీల అధిష్ఠానాల నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో అసమ్మతి నేతలు కాస్త చల్లబడ్డట్టు తెలుస్తోంది. అయితే వైసీపీ అభ్యర్థిని ఓడించడమే ధ్యేయంగా పనిచేయాలంటే స్థానికత చాలా కీలకమన్న భావనలో ఉన్న బలిజ సామాజికవర్గానికి చెందిన ముగ్గురు నేతలు ఇప్పటికీ ఆరణితో మాట్లాడేందుకు అంగీకరించడంలేదు.ఈ క్రమంలో శుక్రవారం ఆరణి శ్రీనివాసులు తిరుపతికి వచ్చారు. అయితే టీడీపీ నుంచి కోడూరు బాలసుబ్రమణ్యం, జనసేన నుంచి పసుపులేటి హరిప్రసాద్ మాత్రమే ఆయన వెంట కనిపించారు. అక్కడినుంచి హోటల్‌కు చేరుకుని అసమ్మతి నాయకులతో ఫోన్లో మాట్లాడే ప్రయత్నం చేశారు.టీడీపీ నేతలు నరసింహ యాదవ్, బుల్లెట్ రమణ తదితరుల ఇళ్లకు వెళ్లినట్టు సమాచారం. మూడు పార్టీలు కలిసే తనను ఎంపిక చేశారని చెప్పుకొచ్చిన శ్రీనివాసులు ఇంతకాలం కష్టపడిన నాయకుల్లో అసంతృప్తి వుండడం సహజమేనని, అయితే త్వరలోనే అన్నీ సర్దుకుంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జనసేన అభ్యర్థి శ్రీనివాసులుకు వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డి ఎదురుపడ్డారు.అభివాదం చేసుకుని బాగున్నారా అంటూ కరచాలనం చేసుకున్నారు.యాధృచ్ఛికంగా జరిగిన వీరి కలయిక వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆరణి వైసీపీ నాయకుడే కాబట్టి వచ్చీరాగానే ఆ పార్టీ అభ్యర్థితో మాటలు కలిపారన్న చర్చ నడిచింది.



మీడియా సమావేశంలో నగరి నేతల ప్లకార్డుల ప్రదర్శన

వెంకటగిరి, నగరిల్లో

వైసీపీ వర్గపోరు

నేదురుమల్లి, రోజాలకు టికెట్లిస్తే పనిచేయమంటున్న జగన్ తమ్ముళ్లు

తిరుపతి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, నగరి నియోజకవర్గాల అధికార పార్టీలో వర్గపోరు తారస్థాయికి చేరుకుంది. శనివారం ఈసీ ఎన్నికల షెడ్యూలును, వైసీపీ అధిష్ఠానం అభ్యర్థుల జాబితానూ విడుదల చేయనున్న నేపధ్యంలో ముందు రోజు జరిగిన పరిణామాలు పార్టీ వర్గాలను కలవరపాటుకు గురి చేశాయి. అసమ్మతి నేతల బలాన్ని పక్కన పెడితే ఎన్నికల ప్రారంభంలో ఇలాంటి ప్రచారం పార్టీ విజయావకాశాలను గణనీయంగా దెబ్బతీస్తుందని శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.వెంకటగిరి వైసీపీలో ఇటీవల సద్దుమణిగి నట్టు కనిపించిన అసమ్మతి శుక్రవారం ఒక్కసారిగా భగ్గుమంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైసీపీకి దూరం కాగా ఆయన స్థానంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ ఇంచార్జిగా నియమితులయ్యారు. జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులను దక్కించుకోవడంతో జిల్లాలో నేదురుమల్లికి సీఎం జగన్ ఎంత ప్రాధాన్యత ఇస్తున్నదీ తేటతెల్లమైంది.దీంతో నియోజకవర్గంలో బలపడాల్సిన రామ్‌కుమార్‌రెడ్డి దానికి భిన్నంగా సొంత పార్టీలోనే బలహీన పడ్డారు. ఆనం రామనారాయణరెడ్డి సన్నిహితులనే అనుమానంతో పలువురు పార్టీ నేతలను దూరం పెట్టారు. అందరినీ కలుపుకుపోవడంలో విఫలమయ్యారు. ప్రారంభంలో అసమ్మతి వర్గం ఆయనకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించినా రామ్‌కుమార్‌రెడ్డి తల్లి రాజ్యలక్ష్మి వారితో మాట్లాడి బుజ్జగించడంతో కొంతమేరకు సద్దుమణిగింది.దీంతో ఎన్నికలు సమీపించినందున అంతా సర్దుకుపోయి నట్టేనని అధిష్ఠానం భావించింది. అలాంటిది శుక్రవారం హఠాత్తుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచీ ప్రజాబలం కలిగిన పలువురు నేతలు తమ అనుచర వర్గంతో రేణిగుంటలోని విమానాశ్రయం వద్దకు వెళ్ళి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఇంచార్జిగా నియమితులైన నాటి నుంచీ పార్టీలో అందరినీ కలుపుకుని వెళ్ళడం లేదని ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆయనకు టికెట్ ఇవ్వొద్దని డిమాండ్ చేశారు.రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే ఆయన గెలుపు కోసం తాము పనిచేసేది లేదని కుండ బద్దలు కొట్టారు. కాదని ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా ఆయన ఓటమి ఖాయమని తేల్చి చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచీ కీలక నేతలు, వారి అనుచరులు మూకుమ్మడిగా రావడంతో పాటు రామ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇస్తే పని చేసేది లేదంటూ నిర్మొహమాటంగా చెప్పడంతో మంత్రి పెద్దిరెడ్డి ఖంగు తిన్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి 24 గంటల సమయం కూడా లేని తరుణంలో వెంకటగిరిలో తలెత్తిన అసమ్మతి తీవ్రతను గుర్తించిన ఆయన తనకు ఒక రోజు సమయం ఇస్తే ఆలోపు అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని సర్దిచెప్పారు. ఒక రకంగా చెప్పాలంటే వెంకటగిరి వైసీపీ అసమ్మతి వర్గం బలప్రదర్శనకు శుక్రవారం విమానాశ్రయ ఆవరణ వేదికైంది. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ముఖ్యనేత కలిమిలి రామ్‌ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో అసమ్మతి వర్గం మంత్రిని కలవగా ఆ బృందంలో వెంకటగిరి వైసీపీ టికెట్ రేసులో వున్న డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనంజయరెడ్డి సైతం వున్నారు. మంత్రిని కలసిన వారిలో వెంకటగిరి ఎంపీపీ తనూజ భర్త శివారెడ్డి, రాపూరు ఎంపీపీ ప్రసన్న, చెన్ను తిరుపాల్‌రెడ్డి, బాలాయపల్లి ఎంపీపీ వెందోడి భాస్కర్‌రెడ్డి, కలువాయి మండల నేత రాఘవరెడ్డి, సైదాపురం జడ్పీటీసీ, ఎంపీపీలు, ఆ మండల నేత నోటి రమణారెడ్డి, డక్కిలి వైస్ ఎంపీపీ గడ్డం సుధీర్‌రెడ్డి, ఆ మండల నేత మాధవరెడ్డిలతో పాటు వెంకటగిరి, రాపూరు మండలాలకు చెందిన 20మంది సర్పంచులు, వారి వర్గీయులు వున్నారు. ఎన్నికల షెడ్యూలుకు ముందురోజు సంభవించిన ఈ పరిణామం వెంకటగిరి నియోజకవర్గ అధికార పార్టీలో కలకలం సృష్టించింది.

అసమ్మతి వర్గంలో రోజాపై వీడని వ్యతిరేకత

నగరి విషయానికొస్తే మంత్రి రోజాకు అసమ్మతి బెడద తగ్గడం లేదు సరికదా అంతకంతకూ పెరుగుతోంది. ఎంతోకాలంగా రోజాను వైసీపీలో పలువురు నేతలు వ్యతిరేకిస్తూ వస్తున్నా అధిష్ఠానం పట్టించుకున్న దాఖలాల్లేవు. ఎన్నికలు సమీపించేసినందున ఇక అసమ్మతి వర్గం సర్దుకుపోతుందని భావిస్తున్న తరుణంలో ఆ అంచనాలు తారుమారయ్యాయి. శుక్రవారం నియోజకవర్గానికి చెందిన పలువురు మండల స్థాయి నేతలు తిరుపతిలో మీడియా సమావేశం పెట్టి మరోసారి తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు.రోజాకు టికెట్ ఇవ్వకూడదని అధిష్ఠానాన్ని వడమాలపేట జడ్పీటీసీ మురళీధర రెడ్డి కోరారు. తమ మాట కాదని టికెట్ ఇస్తే ఆమెను ఓడిస్తామని హెచ్చరించారు.ఈ విషయంలో అధిష్ఠానం మాట కూడా వినే పరిస్థితిలో లేమని అన్నారు. రోజా అక్రమాలు, వేధింపులపై పార్టీ నేతలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. అసంతృప్త నేతలతో అధిష్ఠానం మాట్లాడి ఒప్పించిందని, ఇప్పుడు అంతా సవ్యంగా ఉందనే ప్రచారంలో ఏమాత్రం నిజం లేదన్నారు.ఎప్పటికీ ఆమెపై ఉన్న వ్యతిరేకత పోయే పరిస్థితి లేదన్న విషయాన్ని పార్టీ అధిష్ఠానం తెలుసుకొని ఇంకొకరికి సీటు ఇస్తే కష్టపడి గెలిపించుకుంటామన్నారు. అధికారంలోకి రాక ముందు రోజాకు ఉన్న అప్పులు, ఇప్పుడు ఉన్న ఆస్తులను పరిశీలిస్తే ఆమె ఏ స్థాయిలో అక్రమాలకు, అవినీతికి పాల్పడిందో తెలుస్తుందన్నారు.బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీ రవిశేఖర్‌రాజు, వైసీపీ నేతలు తులసీరాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునేంద్ర, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మాజీ ఎంపీపీ



ఇందిరమ్మను టీడీపీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

పాలసముద్రం, మార్చి 15: పాలసముద్రం మాజీ ఎంపీపీ బి.ఇందిరమ్మ శుక్రవారం టీడీపీలో చేరారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు సమక్షంలో ఆమె పార్టీలోకి వచ్చారు. ఐదేళ్లుగా ఈమె వైసీపీలో ఉంటున్నారు. అలాగే నిశ్శింకాపురం గ్రామానికి చెందిన చల్లయ్య నాయుడు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిద్దరికీ చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. గంగాధరనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్ గెలుపుకోసం పనిచేయాలని సూచించారు. వీరివెంట పాలసముద్రం, శ్రీరంగరాజపురం టీడీపీ అధ్యక్షులు సి.రాజేంద్రన్, గంధమనేని జయశంకర్ నాయుడు, మాజీ ఎంపీటీసీ బాబు నాయుడు, నాయకులు వినోద్, రాజశేఖర్ నాయుడు, చేతన్ తదితరులున్నారు. అనంతరం వీరు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడిని కలిసి సన్మానించారు.

కమ్మ భవన్ నిర్మాణానికి ఇందుశేఖర్ భారీ విరాళం



కొల్లూరి ఇందుశేఖర్ దంపతులకు కమ్మ సంఘ ప్రతినిధుల సత్కారం

తిరుపతి (కొర్లగుంట), మార్చి 15 : తిరుపతి సమీపంలోని వకుళమాత ఆలయం దగ్గర తిరుపతి కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం నిర్మించతలపెట్టిన అంతర్జాతీయ కమ్మ భవనం నిర్మాణానికి చంద్రగిరి టీడీపీ నేత కొల్లూరి ఇందుశేఖర్ రూ. కోటిన్నర విరాళం ప్రకటించారు. తన తాత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే మేడసాని వెంకటరామానాయుడు అలియాస్ మీసాల నాయుడు పేరిట రూ. కోటితో కన్వెన్షన్ హాలు, తన తండ్రి కొల్లూరి మోహన్ నాయుడు పేరిట రూ. 50 లక్షలతో భోజనశాల నిర్మించాలని ఆయన సంఘ నిర్వాహకులను కోరారు. అంతర్జాతీయ కమ్మ భవన నిర్మాణానికి భారీ విరాళం ప్రకటించిన నేపధ్యంలో శుక్రవారం కమ్మ సంఘం అధ్యక్షులు పులిపాటి పురంధరనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేమూరి జయరాం ప్రసాద్, ఉపాధ్యక్షుడు రామచంద్ర నాయుడు, సభ్యుడు లీలా కృష్ణమ నాయుడు తదితరులు కొల్లూరు ఇందుశేఖర్ దంపతులను వారి నివాసంలో ఘనంగా సత్కరించారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో

ఐరాల(కాణిపాకం), మార్చి 15: కాణిపాక వరసిద్ధుడిని శుక్రవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, డీఎస్పీ రాజగోపాల్, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

15 రోజులు.. రూ.7 కోట్లు

- పంచాయతీల్లో పన్నుల వసూళ్ల లక్ష్యం సాధ్యమా?

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 15: ఈ ఆర్థిక సంవత్సరం మరో 15 రోజుల్లో ముగియనుంది. అప్పట్లోగా పన్నులు.. పన్నేతర వసూళ్ల రూ.7 కోట్లు కావాలి. పంచాయతీల్లో ఇది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది. దీని ప్రభావం అభివృద్ధిపై పడుతుందన్న ఆందోళనా వ్యక్తమవుతోంది. గత ఏడాది నుంచి పంచాయతీల్లో లావాదేవీలన్నింటినీ డిజిటల్ విధానంలోనే నిర్వహిస్తున్నారు. వీటిపై గ్రామీణులకు తగిన అవగాహన లేకపోవడం, సిబ్బంది కొరతతో ఈ ఏడాది వివిధ పన్నుల వసూళ్ల మందకొడిగా సాగుతున్నాయి. శుక్రవారం వరకు 62.16శాతం మాత్రమే వసూళ్లయ్యాయి. జిల్లాలో 697 గ్రామపంచాయతీలున్నాయి. ఇంటిపన్నులు, నాన్ ట్యాక్స్ వసూళ్ల కాకపోవడంతో ఈ పంచాయతీల ఆర్థిక పరిస్థితి దిగజారింది. బకాయిల్లో ఎక్కువ భాగం ప్రభుత్వ కార్యాలయాల నుంచే ఉంది. మరోవైపు కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లులు, ఇతరత్రా వాటికి మళ్లించేస్తోంది. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి అటకెక్కింది. అత్యవసర పారిశుధ్య నిర్వహణ పనులూ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. పలు పంచాయతీల్లో పన్నుల సొమ్ము దుర్వినియోగమైన ఘటనలు గతంలో వెలుగుచూశాయి. ఈ క్రమంలో కేంద్రప్రభుత్వం పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులను తప్పనిసరి చేసింది. గతేడాది ఆగస్టు నుంచి జిల్లాలో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. 3000 లోపు జనాభా ఉన్న గ్రామాల్లో యూపీఐ, క్యూఆర్ కోడ్‌ల ద్వారా, ఆపై జనాభా వున్న గ్రామాల్లో పాఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్ ద్వారా పన్నుల వసూళ్ళు చేయాలి. జిల్లావ్యాప్తంగా 113 పంచాయతీలకు గాను 145 పీఓఎస్‌లను అందజేశారు. కానీ, పన్నుల వసూళ్ల మాత్రం మందకొడిగా ఉన్నాయి. గత 350 రోజుల్లో 62.16 శాతం పన్నుల వసూళ్ల జరగ్గా, మిగిలిన 15 రోజుల్లో 38 శాతం (రూ.5.59 కోట్లు).. పన్నేతరకు సంబంధించి రూ.1.47 కోట్లు వసూలు కావాల్సి ఉంది. నెలాఖరులోగా ఇది సాధ్యమేనా అన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఇవీ లోపాలు ...

డిజిటల్ చెల్లింపులపై గ్రామీణ ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో వారంతా పన్నులు చెల్లించేందుకు పంచాయతీ కార్యాలయాలకు నగదుతో వస్తున్నారు. కానీ యూపీఐ లేదా క్యూఆర్ కోడ్, పీఓఎస్‌లతో మాత్రమే చెల్లింపులు చేయాలని పంచాయతీ సిబ్బంది చెబుతుండడంతో ఆ సౌలభ్యం తెలియని గ్రామీణులు పన్నులు చెల్లించకుండా వెనుతిరుగుతున్నారు. పంచాయతీ కార్యదర్శుల తాత్సారం, పోస్టుల ఖాళీ, సిబ్బంది కొరత, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్ళు కూడా పన్నుల వసూళ్ళపై ప్రభావం చూపుతోంది. నగదు రహిత చెల్లింపులను మరింత వేగవంతం చేసేలా డివిజన్‌స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో వసూళ్లు ఇలా.

గ్రామ పంచాయతీలు	రూ.కోట్లలో..
వసూలు కావాల్సిన పన్నులు	రూ. 14.82
ఇప్పటి వరకు వసూలైంది	రూ.9.21
ఇంకా వసూలు కావాల్సింది	రూ. 5.59
పన్నేతర వసూళ్లు (నాన్ ట్యాక్స్)	
వసూలు కావాల్సింది	రూ. 7.92
వసూలైంది	రూ.6,46
ఇంకా వసూలు కావాల్సింది..	రూ.1.47

ఏకాంత సేవకు ఆదిదంపతులు

- ముగిసిన ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలు





శ్రీకాళహస్తి, మార్చి 15: ముక్కంటి ఆలయ శివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి ఏకాంత సేవను వేడుకగా నిర్వహించారు.ఆలయం మూసే వేళ స్వామివారి సన్నిధిలో చిన్న వెండి పల్లకిని ముస్తాబు చేసి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల శివనామస్మరణ మధ్య స్వామి సన్నిధి నుంచి అమ్మవారికి పిలుపునిస్తూ జ్ఞానాంబిక సన్నిధికి తీసుకెళ్లగా అక్కడ అమ్మవారి ఉత్సవమూర్తి పల్లకిలో ఆశీనులయ్యారు. అక్కడినుంచి గురుదక్షిణామూర్తి సన్నిధి నుంచి ప్రదక్షిణపూర్వకంగా పల్లకి స్వామి సన్నిధిలో ఎదురుగా ధ్వజస్తంభం వద్దకు చేరుకుంది. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న శివయ్య ఉత్సవమూర్తి పల్లకిలో దేవేరికి ఎదురుగా ఆశీనులయ్యారు. ఆదిదంపతులు అధిరోహించిన పల్లకిని అమ్మవారి గర్భాలయంలోని శయన మందిరం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ అమర్చిన పడక ఊయలలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, భక్తులు వెలుపలకు వచ్చి తలుపులు మూయడంతో ఏకాంతసేవ ముగిసింది.ఉత్సమూర్తులకు డ్రైఫ్రూట్స్ మాలలను, ప్రత్యేక సుగంధభరితమైన పూలమాలలను, పండ్లను భక్తులు సమర్పించారు. అర్చకులు పంపిణీ చేసిన ఏకాంత సేవ ప్రసాదాన్ని స్వీకరించారు.కాగా ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని శుక్రవారం ఉదయం వేద పారాయణ సభ జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా వివిధ దేవాలయాల నుంచి వచ్చిన 100మంది వేద పండితులు గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదాలను పఠించారు.

ఎన్నికల శిక్షణకు గైర్హాజరైన 16 మంది సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 15: ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13 నుంచి పీవో, ఏపీవోలకు చిత్తూరులోని రెండు కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. మూడ్రోజులుగా జరిగిన శిక్షణ కార్యక్రమాలకు గైర్హాజరైన 16మంది సిబ్బందిని కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు శుక్రవారం రాత్రి సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గైర్హాజరైన పీవో, ఏపీవోలు శనివారం తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆదేశించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 15: ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున సెకండియర్ విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పేపర్-2 పరీక్షలు జరిగాయి. 13,272 మందికిగాను 12,447 మంది హాజరవగా, 825 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌలా తెలిపారు. డీవీఈవో నాలుగు, పరీక్షల జిల్లా కమిటీ ఎనిమిది, స్క్వాడ్ ఆరు సెంటర్లు పరిశీలించారు. కాగా, ఈనెల 20వ తేదీ వరకు ఆప్షనల్ సబ్జెక్టుకు సంబంధించి పరీక్షలు జరగనున్నాయి.

వేలం ద్వారా రూ.44.32లక్షలు ఆదాయం

మదనపల్లె, మార్చి 15: మదనపల్లె మున్సిపాలిటీకి వారపుసంత(మంగళవారం), జంతువధశాల నుంచి వేలం పాట ద్వారా రూ.44.32 లక్షలు ఆదాయం వచ్చింది. ఏడాది పాటు గేటు వసూలు చేసుకునే అధికారానికి గాను కమిషనర్ కెప్రమీల టెండర్లు నిర్వహించారు. ఇందులోభాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేలంపాటల్లో వారపుసంతను కాంట్రాక్టర్ ఎస్.సయ్యద్‌బాషా రూ.42.42 లక్షలకు కైవసం చేసుకున్నారు. ఇద్దరు కాంట్రాక్టర్లు పోటీ పడగా, ఇందులో సయ్యద్‌బాషా హెచ్చుపాటుతో టెండర్ దక్కించుకున్నారు. ఇదే వారపుసంత గతేడాది రూ.54లక్షలు పోగా, ఈసారి 11.58లక్షలు తక్కువ పోయింది. గతేడాది జీఎస్టీ వసూలు చేయలేదని, ఈసారి జీఎస్టీ 18శాతం వసూలు చేస్తున్నట్లు కమిషనర్, మున్సిపల్ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. అలాగే జంతువధశాలను రూ.1.90లక్షలకు కాంట్రాక్టర్ ఎస్‌యాస్మిన్ పాడుకున్నారు. ఇందుకు ముగ్గురు కాంట్రాక్టర్లు పోటీ పడగా, హెచ్చుపాటకు యాస్మిన్ వేలంలో గేటు వసూలుకు హక్కు దక్కించుకున్నారు. ఇప్పటికే దినసరి మార్కెట్ వేలంపాటలు పూర్తి కాగా, ప్రస్తుతం మాంసం మార్కెట్లు, బెంగళూరు బస్టాండు వేలం పాటలకు కాంట్రాక్టర్లు ఎవరూ రాకపోవడంతో వాయిదా పడినట్లు కమిషనర్, ఆర్‌వో వివరించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 15: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిమ్మనపల్లి మండలానికి చెందిన ఓ బాలిక(17) గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు ఇనుప కమ్మీ దొంగల అరెస్టు

కలికిరి, మార్చి 15: నాలుగు లేన్ల జాతీయ రహదారి పనులు జరుగుతున్న ప్రాంతం నుంచి ఇనుప కమ్మీలు చోరీ చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ మోహన్ తెలిపారు. జాతీయ రహదారుల పనుల కోసం హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నిల్వ వుంచిన ఇనుప కమ్మీలను గత శనివారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు అందిన ఫిర్యాదుపై ఇన్‌స్పెక్టర్ మోహన సిబ్బందితో కలిసి చోరీ చేసిన వారిని గుర్తించారు. ఈ మేరకు నల్లమాడకు చెందిన పోలిబోయిన రెడ్డెప్ప, కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆటో డ్రైవరు ముల్లంగి వెంకటేష్‌లను శుక్రవారం అరెస్టు చేశామని చెప్పారు. నిందితుల వద్ద నుంచి రూ.10,500 నగదు, 150 కిలోల ఇనుప కమ్మీలతోపాటు వాటిని తరలించడానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండుకు తరలించినట్లు మోహన్ వివరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పీలేరు, మార్చి 15: మద్యానికి బానిసైన పీలేరు మండలం బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవవడ్డిపల్లెకు చెందిన ఎం.రాజశేఖర్(34) గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిస కావడమే కాకుండా తరచూ కుటుంబసభ్యులతో గొడవలకు పాల్పడే రాజశేఖర్ గురువారం రాత్రి తన ఇంటిపైనున్న గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం శుక్రవారం ఉదయం కనుగొన్న కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజశేఖర్ మృతదేహానికి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అనారోగ్యంతో సీనియర్ సహాయకుడు మృతి



శివకుమార్ (ఫైల్ ఫొటో)

పీలేరు, మార్చి 15: పీలేరు ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న ఎ.శివకుమార్ అనారోగ్య కారణాలతో శుక్రవారం కన్నుమూశారు. గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న శివకుమార్ తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచినట్లు కార్యాలయ సూపరింటెండెంట్ సతీశ్ కుమార్ తెలిపారు. పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీలోని వరంపాటివారిపల్లెలో శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని ఆయన తెలిపారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయండి



లోక్ అదాలత్‌పై సూచనలిస్తున్న న్యాయాధికారి ప్రవీణ్‌కుమార్

తంబళ్లపల్లె మార్చి 15 : తంబళ్లపల్లె జేసీజే కోర్టులో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు, ఇన్‌చార్జ్ జడ్జి ఐ. ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక సివిల్ జడ్జి కోర్టులో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, మొలకలచెరువు, పీటీఎం, మండలాల పోలీసు, సెబ్(స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో) సిబ్బంది. అడ్వకేట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో క్రిమినల్, కాంపౌండబుల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ఎన్ఐ యాక్ట్ కేసులు, సివిల్ కేసులను వాది, ప్రతివాది ఇరువురు సయోధ్య అంగీకారాలతో పరిష్కరించడం జరుగుతాయన్నారు. లోక్ అదాలత్ ఉపయోగాలను ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునేలా చైతన్య పరచాలన్నారు. ఈ సమావేశంలో 4 మండలాల ఎస్ఐలు, ఏపిపి రామకృష్ణ, అడ్వకేట్లు పాల్గొన్నారు.

ముస్లింల రక్షణకు చంద్రబాబు భరోసా

● మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా ● సూపర్‌సిక్స్ పథకాలతో ప్రచారం ప్రారంభం ● ఘనస్వాగతం పలికిన టీడీపీ శ్రేణులు



కాశీరావుపేట టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషాకు స్వాగతం పలుకుతున్న మహిళలు

మదనపల్లె టౌన్, మార్చి 15: ముస్లిం మైనారిటీల రక్షణకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పూర్తి భరోసా ఇస్తున్నారని టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. టీడీపీ అధిష్ఠానం మంగళగిరిలో గురువారం షాజహాన్‌బాషాను మదనపల్లె టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లను కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన శుక్రవారం ఉదయం రోడ్డు మార్గాన తిరుపతి మీదుగా మదనపల్లె నియోజకవర్గంలోని కాశీరావుపేటకు చేరుకోగానే టీడీపీ శ్రేణులు, జనసేన నాయకులు ఎదురువెళ్లి గజమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. షాజహాన్‌బాషా సెంటిమెంట్ ప్రకారం కాశీరావుపేట వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచే . సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంచి పెట్టి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మదనపల్లె పట్టణానికి చేరుకున్న షాజహాన్‌బాషాకు టీడీపీ నాయకులు బాణసంచా పేలుస్తూ, బైక్ ర్యాలీ నిర్వహించారు. కాగా స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు, శ్రేయోభిలాషులు షాజహాన్‌బాషాను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ విద్యాసాగర్, టీడీపీ నాయకులు ఎస్ఏ మస్తాన్, నాదెళ్ల శివన్న, బాలుస్వామి, ఆర్‌జే వెంకటేశ్, మధుబాబు, ఆర్‌కే రామకృష్ణాచారి, మాజీ కౌన్సిలర్ ఆంజినేయులు, కృష్ణమూర్తి, పఠాన్ ఖాదర్ ఖాన్, షంషీర్, నాగూర్‌వలి, మల్లికార్జున, దేవా రమేశ్, నాగయ్య వైశ్యా బ్యాంకు రమణ, హరి, మురళి, విద్యాసాగర్, నాగమణి, హసీనా పాల్గొన్నారు.

సీఏఏ, ఎన్ఆర్‌సీలపై అపోహలు వద్దు

కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న సీఏఏ, ఎన్ఆర్‌సీలపై అపోహలు వద్దని, ముస్లిం మైనారిటీల రక్షణకు చంద్రబాబు పూర్తి భరోసా ఇస్తున్నారని షాజహాన్‌బాషా పేర్కొన్నారు. స్థానిక జామియా మసీదులో జుమ్మా ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో వక్ఫ్‌బోర్డు ఆస్థులను కాపాడేందుకు, ముస్లింల సంక్షేమానికి చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. 175 స్థానాల్లో ముస్లిం మైనారిటీ అయిన తనకు చంద్రబాబు టికెట్ ఇచ్చారంటే ఆయనకు ముస్లింల మీద వున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. ముస్లింలందరూ టీడీపీని ఆదరించాలని ఆయనకోరారు.

షాజహాన్‌బాషాకు టీడీపీ నేతల సన్మానం

వాల్మీకిపురం, మార్చి 15: మదనపల్లె తెలుగుదేశం పార్టీ అభ్యర్థి షాజహాన్‌బాషాను వాల్మీకిపురం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం పట్టణంలోని హసన్‌ఖాన్ వీధిలో తన బంధువుల నివాసానికి విచ్చేసిన షాజహాన్‌బాషాను స్థానిక టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించి రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజేంద్రాచారి, కువైట్ సయ్యద్‌బాషా, అడ్వకేట్ రమణ, మహిళ బీసీ నాయకురాలు స్వర్ణలత, రామాంజులరెడ్డి, కువైట్ సయ్యద్‌బాషా, బొక్కసం బ్రదర్స్ ఆలీ, హనీఫ్, డిష్ బ్రదర్స్, తోటవీధి ఫణి, జనసేన యూత్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ

రామసముద్రం, మార్చి 15: రామసముద్రం మండలం కర్ణాటక సరిహద్దుల్లోని చెక్‌పోస్టులను జిల్లా ఎస్పీ కృష్ణారావ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా చెక్‌పోస్టులలో వచ్చిపోయే వాహనాలను తనిఖీ చేసి అక్రమ మద్యం, డబ్బు రవాణాని అరికట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మండలంలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో అల్లర్లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధులలో పక్షపాతం లేకుండా విమర్శలకు తావులేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా స్టేషన్‌లో నమోదైన వివిధ కేసులను సంబం.దించిన ఫైళ్లను పరిశీలించారు.

సాదాసీదాగా మండల సమావేశం

బి. కొత్తకోట, మార్చి15: బి. కొత్తకోట మండల పరిషత్ కార్యలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోయినప్పటికి వచ్చిన వారితోనే మమ అనిపించారు. ఎంపీడీవో నూర్జహాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల వద్ద నుంచి ఈకేవైసీ ఎన్నికలకోడ్ అమలులోకి రాక ముందే పూర్తిచేయాలని సంబంధిత కార్యదర్శులను ఆదేశించారు. పంచాయతీలకు మండలగ్రాంటు మంజూరు చేయాలని శీలంవారిపల్లె సర్పంచ్ నాగిరెడ్డి, ఆర్టీసీ బస్సులు సకాలంలో లేక ప్రయాణికులు ,విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని బీరంగి సర్పంచ్ వెంకట్రమణ సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, సింగిల్‌విండో చైర్మన్ అమరనాథ్‌లు ప్రసంగించారు. పలుశాఖల అధికారులు హాజరుకాకపోవడం పై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఖాదర్‌వల్లి, ప్రత్యేక ఆహ్వానితులు అరుణ్‌కుమార్, సీడీపీఓ భాగ్యమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

మోడల్ పోలింగ్, మాక్ పార్లమెంటుపై సదస్సు

కలికిరి, మార్చి 15: రాబోయే సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శనివారం కలికిరిలో మోడల్ పోలింగ్, మాక్ పార్లమెంటు, ఓటరు చైతన్యంపై సదస్సు జరుగనుంది. స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగే ఈ సదస్సుకు జిల్లా ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, కళాశాల అధ్యాపకులు హాజరు కానున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఈవీఎమ్‌ల పనితీరుపై అవగాహన

నిమ్మనపల్లి, మార్చి 15: త్వరలో ఎన్నికలు జరుగనుండంతో ఈవీఎమ్‌ల పనితీరుపై బీఎల్‌వోలకు సెక్టోరియల్ ఆఫీసర్ నారాయణ అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 24792మంది ఓటర్లు వుండగా 22బూత్‌లలో పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. బీఎల్‌వోలు పోలింగ్ రోజున ఈవీఎమ్‌లు పనిచేయకపోతే వెంటనే సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. ఓటు వేసిన అనంతరం బీప్ సౌండ్ వచ్చిన తరువాతనే వేరొక ఓటరు ఓటు వేసేందకు అనుమతించాలన్నారు. చిన్న సమస్యలు వుంటే వెంటనే పరిష్కరించేందకు తగిన సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో కేంద్ర బలగాల కవాతు

తంబళ్లపల్లె మార్చి 15 : సార్వత్రిక ఎన్నికలు సమీ పిస్తున్న నేపథ్యంలో బందోబ స్తు నిమిత్తం డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, సీఐ తమ్మిశెట్టి మధు ఆదేశాల మేరకు మండలం లోని తంబళ్లపల్లె, ఉప్పులూరి వాండ్లపల్లె, కొటాల గ్రామాల్లో ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యం లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రానున్న ఎన్ని కల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియో గిం చుకోవాలని ఎస్ఐ శివకుమార్ చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు రవినాయక్, గోపాలకృష్ణ, శంకర్, కానిస్టేబుల్ వెంకట్రమణ లు పాల్గొన్నారు.

ఉచిత కంటి అద్దాలు పంపిణీ

పెద్దమండ్యం, మార్చి 15: కలిచెర్ల మౌలాకా పహాడ్ వద్ద శుక్రవారం ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశారు.. గత నెల 29న కడప పెద్దదర్గా పీఠాధిపతి, మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఆరిఫుల్లా హుస్సేనీ ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి తిరుపతి (అరవింద మధురై శాఖ)వారి సహకారంతో 675 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 204 మందికి కంటి చూపు సన్నగిల్లినట్లు వైద్యనిపుణులు గుర్తించారు. కడప పెద్దదర్గా పీఠాధిపతి, మౌలాకా పహాడ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ సొంత నిధులతో వారికి శుక్రవారం ఉచిత కంటి అద్దాలను సొసైటీ సభ్యులు పంపిణీ చేశారు. గౌస్‌సాబ్, అమీన్‌పీర్, ముష్కీర్, అమీర్‌బాష, బాఖీవుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ దివ్యాంగురాలి ధర్నా

పీలేరు, మార్చి 15: తన ఇంటి స్థల వ్యవహారంలో న్యాయం చేయాలంటూ శుక్రవారం పీలేరు తహసీల్దారు కార్యాలయం ఎదుట వై.చిట్టెమ్మ అనే దివ్యాంగురాలు ధర్నా చేపట్టింది. పీలేరు పట్టణం ఆర్టీసీ నల్లగుట్టకు చెందన తనకు ఓ ఇంటి స్థలం ఉందని, ఆ స్థలాన్ని ఆక్రమించుకుని బత్తల ప్రసాద్ అనే వ్యక్తి దౌర్జన్యంగా ఇంటి నిర్మాణం చేపట్టాడని తెలిపింది. తనకు న్యాయం చేయాలని తహసీల్దారు దగ్గర నుంచి ఎమ్మెల్యే, జేసీ వరకు మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదని ధర్నాకు పూనుకు న్నట్లు తెలిపింది. చిట్టెమ్మకు మద్దతుగా మాల మహా నాడు నాయకులు తుమ్మల ధరణీకుమార్, బాస్ నాయకులు శ్రీనివాసులు ధర్నాలో పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దారు మహబూబ్ బాషా వారితో ఫోనులో మాట్లాడుతూ శనివారం వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి న్యాయం చేస్తానని తెలపడంతో వారు ధర్నాను విరమించారు.

టెన్త్ పరీక్షలకు సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు నిషేధం

కలికిరి, మార్చి 15: పదో తరగతి పరీక్షలకు సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచీలను అనుతించేందిలేదని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటు అధికారులు, ఇన్విజిలేటర్లదే పూర్తి బాధ్యత అని ఎంఈవో కరీముల్లా స్పష్టం చేశారు. మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో కలికిరి ప్రభుత్వ పాఠశాలలో 260 మంది, బాలికోన్నత పాఠశాలలో 260 మంది, మహల్ జడ్పీ హైస్కూల్ (తెలుగు)లో 160 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పదో తరగతి పరీక్షల నిర్వహణలో సన్నద్ధతలో భాగంగా శుక్రవారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటు అధికారులు, ఇన్విజిలేటర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఒక గంట ముందుగా అంటే ఉదయం 8.30కు అనుమతించాలన్నారు. విద్యార్థులతోపాటు విధుల్లో ఉండే అధికారులు కూడా సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు లోపలికి తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. విద్యార్థులు హాల్ టికెట్ తప్ప మరెలాంటి పేపర్లు తీసుకెళ్ళరాదని తెలిపారు. ప్రతి రోజు లాటరీ ద్వారా ఇన్విజిలేటర్లకు రూములు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు శారద, జయమ్మ, చెంగల్రాయుడు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఎమ్మార్సీ సీఆర్పీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఏఏ రద్దు చేసే వరకూ పోరాటం



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకుడు శ్రీనివాసులు తదితరులు

మదనపల్లె/అర్బన్, మార్చి15: పౌర సత్వ సవరణ చట్టం (సీఏఏ) రద్దు అయ్యే వరకూ పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు స్పష్టం చేశారు. సీఏఏ నిబంధనల నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక బెంగళూరుబస్టాండులో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముడిపెట్టడం ద్వారా రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక సూత్రాన్ని సీఏఏ ఉల్లంఘిస్తుందని వివరించారు. ఈ చట్టాన్ని కేరళ, పశ్చిమబెంగాల్, ఢిల్లీ రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నట్లు ఈ సందర్భంగా గుర్తుచేశారు. బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు మాట్లాడుతూ భారత రాజ్యాంగ హక్కులను హరించిన సీఏఏను అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అంజాద్, నాగరాజు, వెంకటేష్, చాన్‌బాషా, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షురాలిని కలిసిన రెడ్డిసాహెబ్



షర్మిలతో మాట్లాడుతున్న ఎస్.రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, మార్చి 15: ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కడప ఎయిర్‌పోర్టులో శుక్రవారం మదనపల్లె నియోజకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మదనపల్లె నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లతున్న విధానం గురించి చర్చించారు. గ్రామ స్థాయిలోకి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, ఆరుసూత్రాలను ప్రజల్లోకి చొచ్చుకుని పోయేవిధంగా పార్టీ శ్రేణులు పని చేస్తున్నట్లు షర్మిలకు వివరించామన్నారు. కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్యేజంతో ముందుకు వెళ్లతుందని తెలిపారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

గుర్రంకొండ, మార్చి 15:గుర్రంకొండ పట్టణంలోని బాలికల ఎస్సీ హాస్టల్‌లో పదో తరగతి చదివే విద్యార్థులకు విద్యాసామగ్రిని దాత సుబ్బరాజు అందజేశారు. ఇందులో భాగంగా హాస్టల్‌లో చదివే 12 మంది విద్యార్థులకు పరీక్షలు రాయడానికి అవసరమైన విద్యా సామగ్రిని వార్డెన్ శంకరయ్యతో కలిసి అందజేశారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని వారు కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ములకలచెరువు, మార్చి 15: ములకలచెరువు మండలం నాయనివారిపల్లెకు చెందిన అన్వర్‌బాషా జాతీయ స్థాయి లాక్రోస్ పోటీలకు ఎంపికయ్యాడు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలో జరిగిన తొలి లాక్రోస్ మెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. ఈ టోర్నమెంటులో వివిధ జిల్లా నుంచి 15 జట్లు పాల్గొనగా అన్నమయ్య జిల్లాకు జట్టు విజయం సాధించిందని, ఆగ్రాలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అన్వర్‌బాషా రాష్ట్ర జట్టు తరపున ఆడుతారని చెప్పారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, మార్చి 15: వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథంలో వెలసిన కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా వైభవంగాఈ నిర్వహించారు. శుక్రవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా వేదపండితులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు అలంకరించారు. శాస్త్రోక్తంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి రక్షాబంధనం, బాసింగ ధారణ, హోమం, మాంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర కార్యక్రమాలు జరిగాయి. షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ట్రస్టు ప్రతినిధులు సారథి, రాధమ్మ, మీనాక్షి, శశికళ, వంశీ, భక్తులు పాల్గొన్నారు.

ఆదరించి గెలిపిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తా

● ఇంటింటా ప్రచారంలో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, మార్చి 15: రాబోవు ఎన్నికల్లో తనను ఆదరించి గెలిపిస్తే నిరుపేదల సంక్షేమం, మండలంలో అభివృద్ధి చేసి చూపిస్తానని పీలేరు టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ చెరువుముందరపల్లె, నాయనవారిపల్లె, కోటపల్లె, తాళ్లపల్లె, పుల్లేటిచెరువుపల్లె, దాసరివారిపల్లె, పాతకోటపల్లెలలో శుక్రవారం ఆయన బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటా సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పుల్లేటిచెరువుపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో హామీల మీద హామీలు ఇస్తూ అధికారం చేపట్టిన సీఎం జగన్ రాబోయే ఎన్నికల్లో ఓటమితో తట్టాబుట్టా సర్దుకోవాల్సిందేనన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి, పీలేరు టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లె మధు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, బీజేపీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, కిశోర్, నాయకులు కృష్ణారెడ్డి, చంద్రమౌళి, పీవీ నారాయణ, కోసూరి రమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీ పథకాలు మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న తనూజా రెడ్డి

కలికిరి, మార్చి 15: టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో మహిళలు ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరగలరని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె స్థానిక ఇందిరమ్మ కాలనీ, మల్‌రెడ్డి గార్డెన్స్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేసి వాటి గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి కిశోర్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కలికిరి ఎంపీటీసీ గాయత్రి, సర్పంచు ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, చంద్రశేఖర్, ఉమామహేశ్వర్ రెడ్డి, సహదేవరెడ్డి, కేవీ రెడ్డి, విజయకుమార్, మున్వర్, శ్రీమన్నారాయణరెడ్డి, రమేష్ చెట్టి, ఏసుదాసు, అగస్తీ, వర్మ, బాషా, రాం బాబు, మధుసూదన రెడ్డి, నాగభూషణ రెడ్డి, తిప్పారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పీటీఎంలో పలు కుటుంబాలు టీడీపీలో చేరిక



బూర్లపల్లెలో టీడీపీలో చేరిన వారితో పార్టీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

పెద్దతిప్పసముద్రం మార్చి 15 : పీటీఎం మండలంలోని ఉమ్మడి బూర్లపల్లె గ్రామంలో పలు కుటుంబాల వారు శుక్రవారం టీడీపీలోకి చేరారు. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి దాసిరిపల్లె జయచంద్రారెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ రమణ, మాదు మంజునాథ్‌రెడ్డి, మాదు రాకేష్‌రెడ్డి, వెంకట్రమణారెడ్డి, ఎస్. బయ్యారెడ్డి, ఎంఎస్ బయ్యారెడ్డి, మాది వెంకట్రమణారెడ్డి, కోట్లోని చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డిగారి నారాయణస్వామిరెడ్డి ఆకుతోట రెడ్డెప్ప, ఎం. సీతారాంరెడ్డి, ఏ. రాజారెడ్డి, ఆర్. నాగరాజు, గోవింద్, బాగ్యమ్మ, ఎం.ఎస్ వెంకట్రమణారెడ్డి, జయరాము, నెలవంక శ్రీనివాసులు, బాపన పెద్దిరెడ్డి, బత్తల శంకర్‌రెడ్డి టీడీపీలో చేరారు. అంతకు ముందు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్, మొరుసుకాపు నేత కోగర మద్దిరెడ్డి, బూర్లపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, పోతుపేట సర్పంచ్ చిన్నపరెడ్డి పట్టా చంద్రమో హన్‌రెడ్డిలతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్-1 పోస్టులలో నిరుద్యోగులకు వైసీపీ కుచ్చుటోపి



మాట్లాడుతున్న తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు అరుణ్‌తేజ

మదనపల్లె టౌన్, మార్చి 15: గ్రూప్-1 పోస్టులను వైసీపీ ప్రభుత్వం సంతలో పెట్టి విక్రయించేసి నిరుద్యోగులకు కుచ్చుటోపి పెట్టిందని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ్ ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో తెలుగు యువత నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 పోస్టులైన డిప్యూటీ కలెక్టర్ పోస్టును రూ.2.5కోట్లు, డీఎస్పీ పోస్టును రూ.1.5కోటికి వైసీపీ ప్రభుత్వం వసూలు చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో 30 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు, 25 డీఎస్పీ పోస్టులను అక్రమంగా భర్తీ చేయడంపై ఏపీపీఎస్సీ మోసాలపై హైకోర్టు మొటిక్కాయలు వేసిందన్నారు. రాష్ట్రంలో 162 మంది గ్రూప్-1 పోస్టుల నియామకాలు చెల్లవని, నెల లోపు మళ్లీ గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి నియామకపు ప్రక్రియ పూర్తి చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దీనికి బాధ్యత వహించి సీఎం జగన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బావాజాన్, పట్టణ అధ్యక్షుడు ప్రణయ్‌రాయల్, శివకృష్ణ, సిద్దు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కులాన్ని కాదు..బహుజన సమాజాన్ని నిర్మిద్దాం



కాన్షీరాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, మార్చి 15: కులాన్ని నిర్మూలిద్దాం.. బహుజన సమాజాన్ని నిర్మిద్దామంటూ వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భారతీయ అంబేడ్కర్ సేన అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక వీసీకే పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన కార్యాలయంలో కాన్షీరాం జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం ఐక్యంగా పోరాడి జహుజన రాజ్యాధికారాన్ని సాధించుకుందామన్నారు.మహాత్మాజ్యోతిరావు పూలే, చత్రపతి సాహు మహరాజ్, పెరియార్ ఈవీ రామస్వామినాయకర్, తదితరుల ఆశయాలను ఆచరణలో పెట్టి సాంప్రదాయ రాజకీయాలకు వ్యతిరేకంగా రాజ్యాధికారాన్ని సాధించిన వాస్తవిక వాది కాన్సిరాం అని శివప్రసాద్ పేర్కొన్నారు. అలాగే వీసీకే పార్టీకార్యదర్శి కేవీ రమణ, నేతలు మోహన్, రవిశంకర్, రెడ్డెప్ప, గంగాధర్, సూరి, రెడ్డిప్రసాద్, శ్రీకాంత్, హైదరవలి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల అమల్లో రాజీ కుదరదు



ఎన్నికల అధికారులకు సూచనలిస్తున్న ఈఆర్వో రమా

కలికిరి, మార్చి 15: ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో అధికారులు రాజీ లేని విధంగా బాధ్యతలను నిర్వర్తించాలని పీలేరు నియోజకవర్గ ఈఆర్వో రమా స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఈఆర్వో మాట్లాడుతూ ఇప్పటికే సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం పీలేరు నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైవలెన్స్, వీడియో వ్యూయింగ్, ఎంసీసీ, అకౌంటింగ్, వీఎస్టీ టీములను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీములు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తక్షణం కార్యరంగంలోకి దిగేందుకు సిద్దంగా వుండాలని కోరారు. ఈ సమావేశంలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా అధికారులు, పోలీసులు హాజరయ్యారు.

ఆలయాల సందర్శనకు ఆర్టీసీ బస్సులు

మదనపల్లె అర్బన్, మార్చి 15: ప్రత్యేక పుణ్యక్షేత్రాలు సందర్శనకు మదనపల్లెడిపోల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండకు ప్రతి సోమవారం మదనపల్లె నుంచి ఉదయం 5.50 గంటలకు, 6.30 గంటలకు రెండు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అవి తంబళ్లపల్లె మల్లయ్యకొండ నుంచి సాయంత్రం 6 గంటల తర్వాతమదనపల్లెకు బయలుదేరి వస్తాయన్నారు. అలాగే అరుణాచల గిరిప్రదక్షిణం కోసం ప్రతి పౌర్ణమి రోజు మదనపల్లె నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి అనంతరం మరుసటి రోజు ఉదయం 4 గంటలకు మదనపల్లెకు చేరుకుంటుందని తెలిపారు. మరెన్ని వివరాలకు సెల్ నెంబర్లకు 7382875034, 7382876638,7382877300 సంప్రదదించాలని కోరారు.